

శోక సంద్రంలో గోళ్లవారిపల్లి

వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంతో మండలంలోని గోళ్లవారిపల్లి శోకసముద్రంలో మునిగింది. గ్రామంలో గోళ్ల మాలకొండయ్య, సుశీల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు. మాలకొండయ్యది వ్యవసాయ కుటుంబం. వీరి కుమారుడు రమేష్ చిరుద్యోగం చేస్తూ బెంగళూరులో ఉంటున్నాడు. అక్క కుమార్తెనే రమేష్ పెళ్లి చేసుకున్నాడు. బస్సు ప్రమాదంలో రమేష్ కుటుంబం సజీవదహనం అయింది. ఈ విషాద సంఘటనతో గ్రామం మూగబోయింది.

● ఎంపీ వేమిరెడ్డి పరామర్శ

మృతుడు రమేష్ కుటుంబాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కర్నూలు బస్సు దుర్ఘటన కలిచి వేసిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

● వెంకయ్య దిగ్ర్భాంతి

వెంకటాచలం : బస్సు ప్రమాదంపై పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాద బాధిత కుటుంబాలను ఫోన్ ద్వారా పరామర్శించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సహా ఇతర అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఆయన ప్రస్తుత పరిస్థితిపై ఆరాతీశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మాట్లాడి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతోనూ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

రమేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం...

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రమేష్ తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల వారిపల్లెలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన గోళ్ల రమేష్ కుటుంబాన్ని శుక్రవారం ఉదయం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంఘటన ఎలా జరిగింది.. కుటుంబ వివరాలపై కలెక్టర్, ఎస్పీతో ఫోన్ ద్వారా మాట్లాడి డీఎన్ఏ టెస్టులకు సంబంధించిన ఏర్పాట్లు చేసేలా చూడాలని తెలిపారు. గ్రామం నుంచి కుటుంబ సభ్యులను కర్నూలుకు పంపించేందుకు ప్రభుత్వ వాహనంతోపాటు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ సంఘటన జరగడం చాలా దురదృష్టకరమని, రమేష్ కుటుంబాన్ని అన్నీ విధాలా ఆదుకుంటామన్నారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం చేస్తామన్నారు. తానూ కూడా సొంత కుటుంబంలా చూసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా... నేను సేఫ్


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మృత్యుంజయుడిగా నెల్లూరు వేదాయపాలెం పరిధిలోని వెంకటరెడ్డి నగర్‌కు చెందిన ముసులూరి శ్రీహర్ష నిలిచారు. వెంకటరెడ్డి నగర్‌కు చెందిన హనుమంతరావు, ఉమాదేవి సంతానం శ్రీహర్ష. ఇంజనీరింగ్‌లో మెకానికల్ పూర్తి చేసి మూడేళ్ల క్రితం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. దీపావళికి నెల్లూరుకు వచ్చిన శ్రీహర్ష పండుగ ముగిసిన తర్వాత వీసా పనిపై తల్లిదండ్రులను తీసుకొని ఈ నెల 22 రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ పనులు చూసుకొని 23 రాత్రి తల్లిదండ్రులు నెల్లూరుకు, శ్రీహర్ష కర్నూలు మీదుగా బెంగళూరుకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం హనుమంతరావు దంపతులు ఇంటికి చేరుకున్నారు. శ్రీహర్ష బెంగళూరుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆవేదనకు అడ్డూ లేకుండా పోయింది. అయితే కొద్ది సేపటికే శ్రీహర్ష తల్లిదండ్రులకు ఫోన్ చేసి నేను క్షేమంగా ఉన్నాను. చిన్న గాయాలు తగిలాయి....కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాను... మీరు ఆందోళన చెందకండి .. అని ధైర్యం చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు ప్రయాణం

భయం..భయం !

● మూలపడ్డ స్పీడ్ లేజర్ గన్‌లు

గతంలో వేగంగా వెళుతున్న వాహనాలకు రవాణాశాఖ అధికారులు స్పీడ్ లేజర్ గన్‌లను ఉపయోగించి కేసులు నమోదు చేసేవారు. అయితే గత రెండేళ్లుగా ఈ గన్‌లు మూలన పడటంతో కేసులు నమోదు కావడంలేదు. దీంతో బస్సులు రోడ్డుపై గంటకు 80 కిలోమీటర్ల స్పీడుతో వెళ్లాల్సి ఉంటే 100 నుంచి 120 కి.మీ వేగంతో దూసుకు పోతున్నాయి.



- రోడ్లపై అతివేగంగా ప్రైవేట్ ట్రావెల్స్
- నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం
- ఆలిండియా పర్మిట్లతో అధికారుల చేతులకు సంకెళ్లు
- వేగం వైపే ప్రయాణికుల మొగ్గు
- అదే బాటలోనే ఆర్టీసీ...

● ఫిట్‌నెస్ సంగతేంటి ?

వాహన ఫిట్‌నెస్‌కు సంబంధించి భద్రత పరంగా ఉండాల్సిన నిబంధనలను వాహనదారులు పాటిస్తున్నారా..? లేదా..? అని వాహనాన్ని చూసినప్పుడు మాత్రమే తెలుస్తుంది.కానీ ఈశాన్య రాష్ట్రాలకు వాహనాలు వెళ్లకుండానే ఫిట్‌నెస్‌లు పొందే అవకాశాన్ని ఈశాన్యరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కల్పిస్తున్నాయి. దీంతో వాహనదారులు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాద ఘటన బస్సుల్లో ప్రయాణించేవారికి భయాన్ని పుట్టించింది. ఈ ఘటనలో నెల్లూరు జిల్లాకు చెందిన పదిమంది ప్రయాణం చేస్తుండగా, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవదహనం అయ్యారు. నలుగురు క్షేమంగా బయటకు రాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు వెళుతుంటాయి. ఈ బస్సుల్లో ఎన్ని బస్సులకు పర్మిట్‌లు ఉన్నాయి, ఎన్ని బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి అన్న దానిపై ప్రజలకు కానీ, అధికారులకు కానీ స్పష్టత లేదు.

అధికారుల చేతులకు సంకెళ్లు

ఆల్‌ఇండియా టూరిస్ట్ పర్మిట్ రాకముందు ప్రతీ వాహనం ఎక్కడ నుంచి ఎక్కడికి తిరగాలి అనేదానిపై స్పష్టత ఉండేది. ఉదాహరణకు నాగాలాండ్‌లో రిజిస్ట్రేషన్ అయిన వాహనం ఆ రాష్ట్రంలో బయలుదేరి పక్కరాష్ట్రాలకు వెళ్లి తిరిగి ఆరాష్ట్రానికే వెళ్లాలన్న నిబంధనలు గతంలో ఉండేది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన ఆల్‌ఇండియా టూరిస్ట్ పర్మిట్ విధానంతో ఏ వాహనం ఎక్కడైనా రిజిస్టర్ చేసుకొని ఏ రాష్ట్రంలో అయినా తిప్పుకోవచ్చు. దీంతో వాహనాలపై అధికారులకు పట్టు తగ్గిపోయింది. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్‌తో కేసులు రాసినా కూడా గతంలోలా ఆన్‌లైన్ వ్యవస్థలో వేరే ట్రాన్‌సెక్షన్ జరగకుండా అడ్డుకునే పరిస్థితి లేదు. మనరాష్ట్రంలో తిరుగుతున్న 90 శాతం వాహనాలు ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయినవే. వాటిపై ఏవైనా చర్యలు తీసుకోవాలంటే రిజిస్ట్రేషన్ అథారిటీ కలిగిన ఈశాన్యరాష్ట్రాల అధికారులే తీసుకోవాలి. దీంతో రాష్ట్రంలో రవాణాశాఖ అధికారుల చేతికి పూర్తిగా సంకెళ్లు పడ్డాయి.

భద్రతా ప్రమాణాలేవీ ?

ప్రమాదం జరిగినప్పుడు అందులో నుంచి బయట పడటానికి కావాల్సిన భద్రతా ప్రమాణాలను ప్రైవేటు వాహనాలు పాటించడం లేదు. ఉదాహరణకు ఎమర్జెన్సీ డోరు ఉన్నా డోరు పక్కనే సీటు ఉండటం, అగ్నిమాపక పరికరాలను బస్సుల్లో ఉంచుకోక పోవడం, బస్సు మధ్య భాగంగా ప్రయాణికులు నడిచేందుకు సరిపడా స్థలం లేకపోవడం, డ్రైవర్ క్యాబిన్‌లో రెండవ డ్రైవర్ నిద్రించేందుకు బెడ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు దిగడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఇలా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ప్రమాదం సంభవించినప్పుడు సురక్షితంగా బస్సులో నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం ఉండడం లేదు.

ఆర్టీసీ బస్సులూ అంతే..

ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రస్తుతం ప్రయాణం భయంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నాయుడుపేట వద్ద ఆర్టీసీ బస్సుల్లో మంటలు వ్యాపించడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. మహిళలకు ఉచిత ప్రయా ణం అమలు చేశాక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. అయితే బస్సుల సంఖ్య పెరగక పోవడంతో ఉన్న బస్సులనే మరమ్మతులు చేసి రోడ్లపై అధికారులు తిప్పుతున్నారన్న ఆరోపనలు ఉన్నాయి. ఈ క్రమంలో అవి ఎప్పు డు ఏ ప్రమాదానికి గురౌతాయోనని ప్రజలు భయపడుతున్నారు.

ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటం రూ. 2,389లు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు పండించిన పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పోస్టరును శుక్రవారం జేసీ వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ ధరలు రైతులకు తెలిసేలా ప్రతీ మండల కేంద్రం, రైతు సేవా కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాలు, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో పోస్టర్లు అతికించాలని అధికారులకు సూచించారు. క్వింటం ఏగ్రేడ్ రకం ధాన్యం రూ.2389లు, సాధారణ రకం రూ.2369లు, మొక్కజొన్నకు రూ.2400, పత్తి పొడవు రకానికి రూ.8110, మినుములు రూ.7800, పెసలు రూ.8768, కందులు రూ.8వేలు, నువ్వులు రూ.9846, వేరుశనగ రూ.7263, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.7721, గడ్డి నువ్వులు రూ.9537, సోయాబీన్ రూ.5328, సజ్జలు రూ.2775, జొన్నలు(మల్‌దండి) రూ.3749, జొన్నలు(హైబ్రిడ్) రూ.3699లుగా ప్రకటించారు. అయితే ఈ ధరకు పంటలు అమ్ముకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే వీఏఏలు, వీహెచ్ఏల వద్ద రిజిస్టర్ చేయించుకుకోవాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.



8

నేడు నాగుల చవితి

● ఆలయాలు, పుట్టల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

పారిశ్రామిక ప్రగతి కోసమే ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్

● ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతి కోసమే ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసీ ఎండీ ఎం.అభిషిక్త్ కిషోర్ అన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నెల్లూరు ఏకేనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం ఇండస్ట్రీయల్ పార్కు పారిశామికవేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. నవంబరు 15 వరకు నెలపాటు రాష్ట్రంలోని అన్నీ జిల్లాల పారిశ్రామిక వాడల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక రాయితీలతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా యువత ముందుకు రావాలన్నారు.అనంతరం ఏకేనగర్ ప్రాంతంలో ఆయన మొక్కలు నాటారు. పలు పరిశ్రమల యజమానులు,యూనియన్ సభ్యులు ఈ సందర్భంగా వారి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం ఎల్.శివ కుమార్, డీజెడ్‌ఎం వెంకట సురేష్, ఐలా కమిషనర్ బ్రహ్మయ్య, ఇంజనీరింగ్ అధికారి శేఖర్‌రెడ్డి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్

మరో ముప్పు

- అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మరోసారి భారీ వర్షాలు
- రానున్న రెండు, మూడు రోజులూ వానలే...
- పెన్నాకు వరదలు.. సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరిక
- 1281 హెక్టార్లలో పంట నష్టం



కందుకూరు : చుట్టుగుంట రోడ్డులో చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిలో అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు

నెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక గండం తప్పిందనుకుంటే... ఇప్పుడు మరో గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడంతో జిల్లాలో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. శుక్రవారం కొన్ని మండలాల్లో భారీగా, మరికొన్ని మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి వర్షపాతం 65.3 మి.మీగా నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అత్యధికంగా కందుకూరులో 168.2 మి.మీ, ఏఎస్‌పేటలో 100.6 మి.మీ, బుచ్చిలో 86.8 మి.మీ, కావలిలో 85.2 మి.మీ, ఉదయగిరిలో 85 మి.మీ, పొదలకూరులో 82.8 మి.మీ, వింజమూరులో 82.4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొన్ని వాగుల ఉధృతి నాలుగు రోజుల నుంచి తగ్గడం లేదు. మనుబోలు వద్ద కండలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిపేశారు. కొండాపురం మండలం కొమ్మి గ్రామం వద్ద గండికట్ల చెరువు అలుగు దాటి నీరు ప్రవహిస్తుండడంతో కావలి, కొండాపురం మధ్య రాకపోకాలు నిలిచాయి. కాగా అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశాలున్నట్లు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపారు.



జలదంకి : ఒకరినొకరు పట్టుకుని వాగు దాటుతున్న గ్రామస్థులు, విద్యార్థులు

● హెచ్చరించిన సెంట్రల్ వాటర్ కమిషన్

పెన్నానదికి భారీ వరద వచ్చే అవకాశమున్నట్లు సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం పెన్నా నది, దాని ఉపనదులకు సంబంధించిన పరిస్థితులను వివరిస్తూ ప్రత్యేక బులెటిన్‌ను జిల్లా అధికారులకు పంపింది. రాబోయే ఐదు రోజుల్లో పెన్నా, లోయర్ పెన్నార్, పాపఘ్ని, చెయ్యేరు నదుల క్యాచ్‌మెంట్లలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, దాని మూలంగా భారీ వరద సోమశిలను తాకే అవకాశమున్నట్లు తెలిపింది.

● 1281 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

నెల్లూరు(వ్యవసాయం) : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు. శుక్రవారం సాయంత్రానికి అందిన సమాచారం మేరకు జిల్లాలో దాదాపుగా 1281 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు లెక్కగట్టారు. 1265.4 హెక్టార్లలో వరి, 11.4హెక్టార్లలో వేరుశనగ, 4హెక్టార్లలో సజ్జ దెబ్బతిన్నాయి. దాదాపుగా 43 గ్రామాల్లోని 1125 మంది రైతులకు చెందిన 1281 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా.

డ్యాముల నిండా నీరు

● సోమశిలకు పెరుగుతున్న వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద శుక్రవారం పెరిగింది. 47,348 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు నాలుగు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో 69.407 టీఎంసీలు నిల్వ ఉంది.

● కండలేరులో 59.905 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యామ్ పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.905 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 4600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3450 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందన్నారు.

● సంగం బ్యారేజ్ పెరిగిన ప్రవాహం

సంగం : బ్యారేజ్‌కి వస్తున్న నీటి ప్రవాహం శుక్రవారం 74 వేల క్యూసెక్కులకు పెరిగింది. ఉదయం 64 వేల క్యూసెక్కుల ఉన్న నీటి ప్రవాహం క్రమేణా పెరిగి 74 వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో బ్యారేజ్ గేట్లన్నీ పైకెత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే నెల్లూరు బ్యారేజ్‌కి విడుదల చేస్తున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో 18.5 అడుగుల నీటిమట్టం

● నిండుకుండలా రాళ్లపాడు

లింగసముద్రం : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది.శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రాజెక్టు నీటిమట్టం 18.5 అడుగులకు చేరింది.ప్రాజెక్టులోకి 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు.కాగా కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం శుక్రవారం మధ్యాహ్నం ఎస్సై ఎం నారాయణతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. తహసీలార్ కోటేశ్వరరావు, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వోలు ప్రాజెక్టు దిగువ గ్రామాలను సందర్శించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.

● గండిపాళెంలో తొమ్మిది అడుగులు..

ఉదయగిరి : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం తొమ్మిది అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. పైతట్టు నుంచి 900 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుందన్నారు.

నుడా వైస్ చైర్మన్‌గా జేసీ

బాధ్యతల స్వీకరించిన వెంకటేశ్వర్లు

8

పోరంబోకు కాదు.. పట్టా భూమే!

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు గ్రామంలో కుంట పోరంబోకు భూమిని ఆక్రమించి సిమెంట్ రోడ్డును నిర్మించారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణలపై శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు స్పందించారు. కాకుటూరులోని సర్వే నెంబరు 62లో ఉన్నది కుంట పోరంబోకు భూమి మాత్రమేనని, ఆ భూమిలో ఎలాంటి సిమెంట్ రోడ్డును నిర్మించలేదన్నారు. అందులోని పట్టా భూమిలోనే ఓ ప్రైవేటు లేఅవుట్ వారు సిమెంట్ రోడ్డును నిర్మించుకున్నట్లు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11704
వెండి కిలో ధర	రూ. 152242
వెండి ఒక గ్రాము	రూ. 158.20

జొన్నవాడ ఆలయంలో కార్తీక దీపారాధన



పూజల్లో పాల్గొన్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం భక్తులు కార్తీక దీపారాధన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి నిత్యకళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి అర్చకులు సామూహిక కుంకుమార్చన చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కుంకుడాకుపై నాగ దేవత!



కుంకుడాకుపై నాగులచవితి చిత్రం

పొదలకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య కుంకుడు ఆకుపై నాగదేవతను మొక్కుతున్న మహిళ చిత్రాన్ని గీశారు. ఈ సూక్ష్మ కళా చిత్రం ఆకట్టుకుంటోంది.

పార్వతమ్మ తల్లికి నెల పొంగళ్లు

మనుబోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్వతమ్మ శిలకు శుక్రవారం నెల పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 24న దసరా నవరాత్రులు ప్రారంభించారు. నెలరోజులు పూర్తికావడంతో దసరా కమిటి అమ్మవారి శిలకు ప్రత్యేకంగా అలంకరించి పొంగళ్ళు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, వెంకట స్వామి, అశోక్‌రెడ్డి,సురేంద్ర గౌడ్, శ్రీనువా సులు రెడ్డి, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రిజర్వాయర్ ఆనకట్టకు మరమ్మత్తులు

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ ఆనకట్టకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కట్ట అక్కడక్కడ కోతకు గురై చిన్నపాటి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడుతోపాటు ఆయకట్టు రైతులు విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముందస్తు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. శుక్రవారం జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా ఆనకట్టపై మట్టిని తరలించి గుంతలు పడిన చోట మరమ్మత్తులు చేశారు. సర్వేపల్లి రిజర్వాయర్ ఏఈ మహేష్‌తో కలిసి సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. వెంటనే స్పందించి ముందస్తు చర్యలు చేపట్టేలా కృషి చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి రైతులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్రపుడెక్క తొలగింపు

విడవలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీగా వర్షాలతో మలిదేవికి ఆనుకున్న గ్రామాలు ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్, ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి పూడిక తీత పనులు చేపట్టారు. జాన్‌పేట, మన్మధ రావు పేట, విడవ లూరు దళిత కాలనీలు ముంపుకు గురి అవుతున్నాయని తెలిపారు. మలిదేవి డ్రైయిన్‌ను పూడికతీయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకోపోవడంతో ఆమె స్వంత నిదులతో మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్ రెడ్డి పర్యవేక్షణలో డ్రైయిన్‌లో గుర్రపు డెక్కను తొలగించామన్నారు. స్థానిక టీడీపీ నాయకులు సత్యవోలు సత్యం రెడ్డి, విఆర్‌వో దుర్గా ప్రసాద్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రదర్శన విజయవంతం చేయాలి

రాపూరు, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంద కృష్ణ మాదిగ నవంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టబోయే దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శనను విజయవంతం చేయాలని శుక్రవారం నెల్లూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సూరిపాక ఉదయ్ కృష్ణ తెలిపారు.

శిథిలావస్థలో 'విజ్ఞాన' భాండాగారం!

- నలభై ఏళ్లనాటి భవనం
- క్షణక్షణం.. భయం భయం!

మనుబోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కడ కూర్చుని పత్రికలు, పుస్తకాలు చదువుతున్నంత సేపు క్షణ క్షణం భయం భయంగానే ఉంటుంది. దీంతో పఠనాసక్తి తగ్గిపోతుంది. ఎప్పుడు కూలుతుందోనని దిగులు తప్ప.. పుస్తకాల్లోని జ్ఞానం పాఠకులకు బోధపడడం లేదు. మనుబోలు తెలుగువిజ్ఞాన సమాచార కేంద్రంగా పాఠకులు పిలుచుకునే గ్రంథాలయం దుస్థితి ఇది. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. రేపటి మేధావులను తయారు చేసే ఉత్పత్తి కేంద్రాలు అంటూ సమావేశాల్లో అధికారులు, పాలకులు ఊదరగొడుతుంటారు. కానీ శిథిలావస్థకు చేరిన ఈ గ్రంథాలయాన్ని చూస్తే పాఠకుల హృదయం ఆవేదనతో బరువెక్కిపోతోంది.

నాలుగు దశాబ్దాల నాటి భవనంలోనే...

మండలంలో ఉన్న ఒక్కగానొక్క గ్రంథాలయం మనుబోలులో ఉంది. ఈ భవనాన్ని 1986లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి, తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రంగా నామకరణం చేశారు. అప్పట్లో చారెడు హాలు, మూరెడు వరండా, కనీసం రెండు, మూడు కుర్చీలు పట్టని చిన్న గది నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడుతున్న భవనంలో పాఠకులు బిక్కుబిక్కుమంటూ పుస్తకపఠనంలో నిమగ్నమవుతున్నారు. కిటికీలు దెబ్బతిన్నాయి. గోడలు పగుళ్ళిచ్చాయి. ఇక శ్లాబ్ సంగతి చూస్తే.. ఇనుప ఊచలు వెక్కిరిస్తున్నాయి. వర్షాకాలంలో ఇక్కడి పరిస్థితి వర్ణనాతీతం. పిల్లర్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి! పుస్తకాలు నిల్వ ఉంచే గది వానకు కురుస్తుండడంతో హాలులోనే పుస్తకాలు, పత్రికలు ఉంచి గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో 6 వేల పుస్తకాలు ఉండడం విశేషం. ఇవన్నీ భారీ వర్షాలకు తడిసిపోయే ప్రమాదం ఉందని పాఠకులు, నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

కానరాని డిజిటల్ లైబ్రరీ..

ప్రతి మండలంలో ఒక డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. గడిచిన ఐదేళ్లలో ఆ ఊసే లేదు. కొత్తది నిర్మించకపోగా, కనీసం పాత భవనానికి మెరుగులు దిద్దలేదు. ప్రస్తుత ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. అందుకోసమే గ్రంథాలయాలకు ల్యాప్‌టాప్, ప్రింటర్ సరఫరా చేశారు. అయితే భవనాన్ని బాగు చేయకుండా డిజిటలైజేషన్ చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని పాఠకులు అభిప్రాయపడుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మనుబోలు గ్రంథాలయం

ఎందుకింత నిర్లక్ష్యం...?

గ్రంథాలయం బాగుచేయాలని తనిఖీకి వచ్చిన జిల్లా స్థాయి అధికారులకు ఏళ్ళ తరబడి మనుబోలు గ్రామస్తులు, పాఠకులు విన్నవిస్తూనే వస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పంచాయతీ సిబ్బంది గ్రంథాలయ పన్ను కూడా ప్రజలనుంచి వసూలు చేస్తారు. కనీసం జిల్లా పంచాయతీ అధికారులైనా ఈ విజ్ఞాన సమాచార కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు.

భయంతో పనిచేస్తున్నా..



మూడేళ్ళుగా భయంతో పని చే స్తున్నా. అధికారులకు, గ్రామ పెద్ద లకు భవనం శిథిలావస్థకు చేరిందని తెలియజేశాం. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. పెచ్చులూడిన భవనంలో ఉండాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి కొత్తభవనం మంజూరు చేయాలి.

-అరుణ్‌కుమార్, గ్రంథాలయ భాండాగారి

ఎప్పుడు కూలిపోతుందో...



ఇక్కడ అన్ని దిన, వార, మాస పత్రికలు ఉన్నాయి. వీటితో పాటు పురాణ, చరిత్ర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తీరిగ్గా చదవాలంటే.. భవనం ఎప్పుడు కూలిపోతుందో నని భయమేస్తోంది. అన్ని పుస్తకాలు తడిసిపోతున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ భవ నంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

- చప్పరం శేషయ్య, పాఠకుడు

చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఆలయ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మలపూడి గ్రామంలోని దళితవాడలో నూతన శ్రీదేవి, భూదేవి చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు మన్నెమాల భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అంతకు మునుపు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు, గొడుగులు, వృద్ధులకు దుప్పట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వీటిని అందజేసిన భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. వైసీపీ హయాంలో 12 ఇళ్లకు సంబంధించి స్టీలు, సిమెంట్, డబ్బులు తీసుకుని కనీసం ఒక్క ఇల్లయినా పూర్తి చేయలేదన్నారు. డబ్బులు తీసుకుని వెళ్లిపోయిన కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను, పోలీసులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. గిరిజనుల విషయంలో అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మధునాయుడు, టీడీపీ నాయకులు మన్నెమాల ఆదినారాయణరెడ్డి, మన్నెమాల శ్రీనువాసులు రెడ్డి, పెంచల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంచలయ్య, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఎంఈవో టీ శ్రీనివాసులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మం డలంలో అన్ని పాఠశాలల్లో కొంద రు విద్యార్థులు ఆధార్ పొందకపోవడం, నవీకరణ చేసుకోకపోవడంతో వారి సౌకర్యార్థం కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కేం ద్రం ఈనెల 30వ తేదీ వరకు కొనసాగు తుందని, నూతనంగా ఆధార్‌కార్డు కోసం, చేర్పులు, మార్పుల కోసం కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

●వింజమూరు: విద్యార్థుల ఆధార్ నమో దుకు స్థానిక బాలికల హైస్కూల్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో శ్రీని వాసులురెడ్డి తెలిపారు. వింజమూరు మండలానికి చెందిన 1400 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు బాలుర హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికలు హైస్కూల్‌లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు.

మంత్రి చొరవతో మెరుగైన వైద్యం


రాపూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాపూరు మండలంలో ఎస్సీ గురుకుల హాస్టల్‌లో తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక చొరవతో మెరుగైన వైద్యం అందించి చికిత్స చేయించారు. బుధవారం తీవ్ర అస్వస్థతను గురైన విద్యార్థిని సుహాసినీ మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చేర్చగా, ఈ విషయం తెలుసుకున్న మంత్రి డోలా వీరాంజనేయులు ప్రత్యేక చొరవతో వైద్యం చేయించి ప్రాణాలు కాపాడారు. నెల్లూరుజిల్లా రాపూరు మండలం మద్దూరుపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో 6వ తరగతి విద్యార్థిని చల్లా సుహాసినీ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురి కాగా హాస్టల్ వార్డెన్, సిబ్బంది గూడూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి స్వామి తిరుపతి జిల్లా కలెక్టర్, ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి విద్యార్థినిని తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి ప్రత్యేక వైద్యం చేయించారు. ప్రస్తుతం ప్రాణాపాయస్థితి నుంచి కోలుకుని ఆరోగ్యం నిలకడగా ఉంది. మరికొద్ది రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. నేటి వరకు అనారోగ్యానికి గురైన 30 మందికిపైగా అంబేద్కర్ గురుకు లాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల కు మంత్రి వైద్యం చేయించారు.

ప్రత్యేక బస్సులు

రాపూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని రాపూరు ఆర్టీసి డిపో మేనేజర్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాసంలో ప్రతి సోమవారం ప్రముఖ శైవ పంచరామాల క్షేత్రాలైన అమరేశ్వర స్వామి - అమరావతి, సోమేశ్వర స్వామి - భీమవరం, క్షీర రామలింగేశ్వర స్వామి - పాలకొల్లు, భీమేశ్వర స్వామి - ద్రాక్షారామం, కుమార రామ భీమేశ్వర స్వామి - సామర్లకోట పుణ్య క్షేత్రాలకు బస్సులను తిప్పుతామ్మన్నారు.

పెన్నా పొర్లుకట్టలకు మరమ్మతులు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



పొర్లుకట్టలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల నేపధ్యంలో సోమశిల జలాశయం నుంచి ఇప్పటికే 90వేల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని దిగువ పెన్నానదికి విడుదల చేసిన తరుణంలో కోవూరు నియోజకవర్గంలోని పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని పొర్లుకట్టల పటిష్ట భద్రతకోసం నేటినుంచి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెల్లడించారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగరాజపురం, జొన్నవాడ గ్రామాల పరిధిలోని పెన్నా పరీవాహక ప్రాంతాల్లో గత వరదలకు దెబ్బతిన పొర్లుకట్టలు, ఆయా గ్రామాల నాయకులు, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే పరిశీలించి పొర్లుకట్టల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గంలోని పెన్నాపరీవాహక ప్రాంతంలో పొర్లుకట్టలు దెబ్బతినకుండా తాత్కాలిక మరమ్మతులకోసం నిధులు కేటాయించారన్నారు. ఆ మేరకు నేటి నుంచి పొర్లుకట్టలు బలహీనపడి దెబ్బతిన్న ప్రాంతాల్లో పటిష్టం చేసేందుకు మరమ్మతులు చేపడతారని తెలిపారు. ఇరిగేషన్‌తోపాటు సంబంధిత అధికారులు, రైతులు, అందరి సమిష్టి సలహాలతో నిధులు తప్పుదారి పట్టకుండా పొర్లుకట్టల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. శ్రీరంగరాజుపురంలోని గిరిజనకాలనీలో లోతట్టు ప్రాంతంలో వున్న గిరిజన ఇళ్ళు పరిశీలించి కొత్త ప్రభుత్వ ఇళ్లు, డ్రైన్లుకు హామీ ఇచ్చారు. పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టడంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారికి హామీ ఇచ్చారు. నాయకులు కమలాకర్‌రెడ్డి, కేవీ. శేషయ్య తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, ఎంపడీఓ మంజులమ్మ, ఆర్‌ఐ శాంతిప్రియ, జొన్నవాడ సర్పంచు పెంచలయ్య, ఉమ్మయ్యస్వామి, సుధాకర్, నాయకులు ప్రసన్నకుమార్, మాల్యాద్రి, శంకర్, మహేంద్రతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారాలు నమ్మకండి

మనుబోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): యూరియాపై వైసీపీ చేస్తున్న అసత్యప్రచారాలను రైతులు నమ్మవద్దని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో శుక్రవారం వ్యవసాయాధికారులు రైతులకు యూరియా కార్డులు, బస్తాలు పంపిణీ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు సొసైటీ చైర్‌పర్సన్ పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, ఏడిఏ శివనాయక్, ఏవో వెంకటకృష్ణయ్య, టీడీపీ నాయకులు మన్నెమాల శ్రీనువాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

ఇళ్లు.. పాఠశాలల జలమయం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామంలోని దర్గా పక్కనే వున్న ఉర్దూ స్కూలు, కమ్యూనిటీహాలు ప్రాంతంలోని 4వీధుల్లో రోడ్డుకిరువైపులా వున్న ఇళ్ళు మోకాటిలోతు వర్షం నీళ్ళతో జలమయమయ్యాయి. దీంతో శుక్రవారం ఉర్దూ పాఠశాలను తెరిచేందుకు వెళ్ళిన ఉపాధ్యాయిని పాఠశాల ఆవరణలో మోకాటి లోతు నీళ్ల వుండడంతో స్కూల్‌లోకి వెళ్ళలేక వెనుదిరిగింది. ఉర్దూ స్కూలు పిల్లలను గ్రామంలోని ప్రధాన స్కూల్‌లోకి మార్చి విద్యాబోధన చేసినట్టు ఎంఈఓ దిలీప్‌కుమార్ తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం ప్రహరీ కట్టి గాలికొదిలేయండంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోయారు. కమ్యూనిటీహాలు పక్కన వరుసగా 4వీధుల్లో రొడ్డుకిరువైపులా వున్న నివాసాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమ్యూనిటీహాలు దగ్గర్నుంచి మలుపు వద్ద ప్రధాన మార్గం వరకు సుమారు 250 మీటర్లు మేర కాలువ పూడిక తీసివుంటే ఆ ప్రాంతంలోని నీళ్ల ప్రధాన పొలాలవైపు వెళ్ళిపోయి మాకీ సమస్య వుండేదికాదని ప్రజలు ఆవేదన చెందారు.



పోలినాయుడు చెరువులో జలమయమైన పాఠశాల

మనుబోలు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, ఎగువన విడుదల చేసిన నీటితో కండలేరు వాగు శుక్రవారం మరింత ఉధృతంగా ప్రవహించసాగింది. దీంతో మనుబోలు రహదారిపై మోకాటిలోతున నీరు ప్రవ హించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు వాగు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

C.R.I.M.E N.E.W.S

ముళ్లపొదల్లో వ్యక్తి మృతదేహం

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారంపేట గ్రామ సమీపంలో ఎంఎస్ఎంఈ పార్కు, నేషనల్ హైవే మధ్య ముళ్ల పొదల్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు, వీఆర్వో కె సాయికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని పేర్కొన్నారు.

శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

ఏఎస్ పేట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యో తి): మండలంలోని చిరమన గ్రామంలోని శివాలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు త వ్వకాలు జరిపారని గ్రా మస్థులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోకి ప్రవేశించి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తాళాలు పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి ఒక రాయిని సైతం తొలగించారు. తవ్వకాలు జరిపే సమయంలో శబ్ధాలు రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు లేచి గుడి దగ్గరకు వచ్చి చూడగా దుండగులు అక్కడ నుండి పారిపోయారు. దీనితో గ్రామ స్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంగం సీఐ వేమా రెడ్డి, ఏఎస్ పేట ఎస్ఐ సైదులు, సంగం ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ అరెస్ట్


- బెదిరించి నగదు దోచుకున్న కేసులో చర్యలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చంపుతానని పండ్ల వ్యాపారిని బెదిరించి నగదు దోచుకున్న కేసులో బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌కు చెందిన కావలి మహేష్ సంవత్సర కాలంగా మద్రాసు బస్టాండు కూరగాయల మార్కెట్ సమీపంలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద శోధన్‌నగర్‌కు చెందిన కృష్ణసింగ్ తరచూ పండ్లు కొనుకున్నేవాడు. గురువారం రాత్రి వహాబ్‌పేటలోని పెట్రోల్‌బంకు వద్ద మహేష్ పండ్లు అమ్ముతుండగా కృష్ణసింగ్ అక్కడికి వెళ్లి మద్యం తాగేందుకు రూ.వెయ్యి ఇవ్వమని అడిగాడు. ఆయన డబ్బులు లేవని చెప్పడంతో పక్కనే దొరికిన ఖాళీ బీర్‌బాటిల్‌ను పగులగొట్టి డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. మహేష్ భయంతో నగదు ఇచ్చాడు. విషయాన్ని గమనించిన మహేష్ స్నేహితులు లైసిఫ్, మహబూబ్ అక్కడికి రావడాన్ని గమనించిన కృష్ణసింగ్ పరారయ్యాడు. బాధిత పండ్ల వ్యాపారి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి శుక్రవారం నిందితుడుని అరెస్ట్ చేశారు.

మహిళ బలవన్మరణం

నెల్లూరు (సిటీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సహజీవనం చేసే వ్యక్తితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరు రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన రాజేశ్వరి (40) భర్తకు దూరమై జేజేపేటకు చెందిన భానుచందర్‌తో అల్లీపురం వద్దనున్న టిడ్కో గృహాల్లో సహజీవనం చేస్తోంది. భానుచందర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇరువురి మధ్య మనస్పర్థలు, ఆర్థిక లావాదేవీల కారణంగా రాజేశ్వరి గురువారం రాత్రి తన ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పాలధారల వాన.. పెంచలకోన!



ఉదయసంధ్యల్లో ప్రత్యక్షమయ్యే 'ఆకుపచ్చని' స్వర్గాన్ని మీరెప్పుడైనా చూశారా? ఆకాశపు అంచులు తాకే కొండ శిఖరాలను అందుకున్నారా..? మంచు కొండలను ముద్దాడే మేఘాల అద్భుత సౌందర్యాన్ని ఆస్వాదించారా..? చూపుల తీరాల్లో ఏపుగా ఎదిగిన మహా వృక్షాల రహస్యాలు మీకు తెలుసా? స్వచ్ఛమైన పాలధారల వానలో ఒక్కసారైనా తడిసి ముద్దయ్యారా? హృదయ వీణను మీటుతూ.. నింగినుండి జాలువారే జలపాతపు చప్పుళ్లు వినిపిస్తున్నాయా? ఆ.. పక్కనే ప్రవహించే పుణ్యఫలదాయిని.. కణ్వ నదీమ తల్లి ప్రసాదించే కమనీయ అలల తుం పరలను భక్తితో కళ్లకద్దుకున్నారా? నేల తల్లి పాదాల వద్ద ప్రారంభమై.. లక్షలాది అడుగుల పాతాళ లోకపు ప్రచండ లోయల పర్యావరణ ప్రయాణానికి మీరు సిద్ధమా? అయితే.. రండి.. తనువును.. మనసును పులకింపజేసే చలచల్లని 'వర్ష రుతువు' సాక్షిగా.. ప్రకృతి రమణీయ దృశ్య ప్రపంచంలోకి 'పెంచలకోన అందాలు' మీకు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్నాయి. మరపురాని ఈ రమణీయ జలపాతపు సొగసులను తిలకించేందుకు నెల్లూరు జిల్లా నుండే కాకుండా, ఇతర ప్రాంతాల నుండి కూడా సందర్శకులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంచలకోన జలపాతం జోరుగా పరవళ్లు తొక్కుతుంది. ఆలయ సమీపంలో ఉన్న కణ్వ నది వానల ధాటికి ఉధృతంగా ప్రవహిస్తోంది. పెంచలకోన ఆలయం చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఇక్కడ దశాబ్దాల క్రితం కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నెల్లూరు నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంచలకోనలో ఆధ్యాత్మికతను, ఆహ్లాదకర దృశ్యాలను ఆస్వాదిస్తూ, గోవింద నామస్మరణతో పర్యాటకులు తన్మయం చెందుతున్నారు. జలపాతపు సోయగాలను చరవాణిలో హృద్యంగా బంధిస్తున్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)



నేత్రపర్వంగా శ్రీవారి తిరుమంజనం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా బాలాజీనగర్ సీతారామమందిరంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి శుక్రవారం తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు లక్కీడిప్ ద్వారా అమ్మవారి చీరలు ప్రసాదంగా అందజేశారు. జొన్నలగడ్డ చంద్రశేఖర్‌రాజు, శైలజ, ఆలయ చైర్మన్ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితికి అన్నీ సిద్ధం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి సందర్భంగా శనివారం భక్తుల కోసం మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో యూ జానకమ్మ తెలిపారు. భక్తుల కోసం ఆలయంలోని పుట్ట వద్ద క్యూలైన్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భక్తులు తెల్లవారుజాము నుంచే తమ నోములు నోచుకునేలా అన్నీ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు-2 డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజల సలహాల స్వీకరణకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ షేక్ కరిమున్నీసా తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతుందని, 9959225642 నెంబరుకు ప్రజలు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు.

కార్తీకమాసంలో ప్రత్యేక బస్సులు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు-2వ డిపో పరిధిలో అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ కరిమున్నీసా మరో ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 26, నవంబరు 2,4,9,16 తేదీలలో ఉదయం 10 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయని, ఈ బస్సుల్లో రానుపోనూ రూ.1200 చార్జీ వసూలు చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోగానీ, ఆన్‌లైన్‌లో 94833 సర్వీసు నెంబరు బస్సులలో రిజర్వేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9959225642, 9000323612 నెంబర్లను సంప్రదించాలని కోరారు

విద్యుత్ అంతరాయంతో ప్రజలకు ఇబ్బందులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 4వ మైలులో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయం గురించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. దోమలతో తీవ్రంగా ఇబ్బందులు గురయ్యారు

అమ్మ ఆసుపత్రిలో రేపు ఫెర్టిలిటీ వైద్య శిబిరం

● ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ దివ్యశ్రీ



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం నీటిపారుదల శాఖ కార్యాలయం వెనుక ఉన్న అమ్మ ఆసుపత్రి, ఐవీఎఫ్ సెంటర్‌లో ఆదివారం ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ దివ్యశ్రీ తెలియచేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పిల్లలు లేని వారు ఎన్నో ఏళ్ల నుంచి పిల్లల కోసం ఎదురుచూసి నిరాశ చెందుతున్నారన్నారు. ఇలాంటి వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి పిల్లలు పుట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఫెర్టిలిటీ చికిత్సలో 10 ఏళ్లుగా అనుభవం ఉందని వెల్లడించారు. పిల్లలు లేని వారి కోసం ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలియచేశారు. ఈ శిబిరంలో వీర్య పరీక్షతో పాటు వైద్యుల కన్సల్టేషన్ ఉచితమని అలాగే స్కానింగ్ తోపాటు డైట్, యోగా సలహాలు ఉచితమని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం రాహుకాల ఉద్వాపన పూజ, రాహుకాల పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి ఉదయం విశేష పూజలు, పుష్పాలంకారం జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సాయం సంధ్యామేళం, పురాణ ప్రవచనం, కుంభహారతులు, పల్లకీసేవ జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

భువనేశ్వరికి వైభవంగా ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరీ అమ్మవారి ప్రాకారోత్సవం, పేట ఉత్సవం వైభవంగా జరిగాయి. ఉదయం మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు.

● మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో ఉన్న భవానీ శంకరస్వామికి రాత్రి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి.

శివతత్వం అనంతమైనది

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : శివతత్వం అనంతమైనదని సూరం అరుణ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా రేబాలవారివీధి రాజ్‌టవర్స్‌లో పద్యసారస్వత పరిషత్ ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమంలో శుక్రవారం ఆమె ప్రవచనం చేశారు. బెజ్జమహాదేవి పూసలుడు, గోడగూచి కథల ద్వారా శివతత్వాన్ని విశదీకరించారు. కార్యక్రమంలో సహస్ర అవధాని కోట రాజశేఖర్, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, పాముల మల్లికార్జున్, కోట రామమూర్తి పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాలు.. దోమల ఆవాసాలు



నగరంలో ఇళ్ల మధ్య చేరుతున్న మురుగునీరు



తటాకాన్ని తలపిస్తున్న ఖాళీ ప్రదేశం

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖాళీ ప్రదేశాలు కాస్తా దోమల ఆవాసాలుగా మారుతున్నాయి. కొన్ని చోట్ల చిన్నపాటి వర్షానికే నీరు చేరుతుండగా మరికొన్ని చోట్ల డ్రైనేజీ వసతులు సక్రమంగా లేకపోవడంతో సమీపంలోని ఇళ్లలోని మురుగునీటితో నిండిపోతున్నాయి. వీటివల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెంది నగర ప్రజలకు నరకం చూపుతున్నాయి. దోమల బెడదతో నగర ప్రజలు అల్లాడిపోతున్నారు.

నెల్లూరు నగరంలోని ఎటు చూసినా రూ.2లక్షల నుంచి రూ.8లక్షల వరకు అంకణం ధర పలుకుతోంది. అయితే అందుకు తగ్గట్టుగా అక్కడ వసతులు మాత్రం ఉండడం లేదు. ముఖ్యంగా నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని పరమేశ్వరి నగర్, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా ఉంటోంది. ఆ యా ప్రాంతాల్లో డ్రైనేజీలు అంతంత మా త్రంగానే ఉన్నాయి. ఈప్రాంతాల్లో చుట్టుపక్కల చూసేందు కు అపార్టుమెంట్లు, లగ్జరీ ఇళ్లు కనిపిస్తుంటాయి. అయితే కొద్దిపాటి వర్షం వచ్చినా చుట్టుపక్కల ఉన్న ఖాళీ ప్రదేశాల న్నీ నీటితో నిండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సౌక ర్యం సక్రమంగా లేకపోవడంతో ఇళ్లల్లో వాడిన మురుగు నీరంతా ఇళ్ల పక్కనే చేరి మురుగునీటి తటాకాలుగా మారు తున్నాయి. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. చీకటి పడుతోందంటే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు దోమల దాడి నుంచి తప్పించుకునేందుకు తలుపులు మూసేస్తు న్నారు. మరోవైపు దోమల బ్యాట్లకు పనిచెప్పేవారు మరికొందరు. మస్కిటోలు వాడుతున్నా దోమల బెడద మాత్రం తగ్గడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కదలకుండా ఒక చోట కూర్చునే పరిస్థితి లేదని దోమల బెడద అంత విపరీతంగా ఉంటోందని చెబుతున్నారు. దోమల నివారణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాటిని అదుపు చేయలేకపోతున్నామని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు దోమల నివారణా చర్యలు కేవలం నామమాత్రంగానే చేపడుతున్నారని విమర్శిస్తున్నారు. వర్షాకాలం వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని దోమల నివారణకు చర్యలు తీసుకుని తమను రోగాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు. అదేవిధంగా పిచ్చిమొక్కల ఏపుగా పెరగడంతో విషపురుగుల బెడద కూడా ఉంటోందని వర్షపు నీరు చేరడంతో పాములు రోడ్లపైనే తిరుగుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వర్ష బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



సామగ్రిని అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్, సభ్యులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలో భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన వారికి రెడ్‌క్రాస్ చేయూతనందించింది. శుక్రవారం జనార్ధన్‌రెడ్డి కాలనీ, బాలాజీనగర్‌లో ఆరుగురి ఇళ్లు దెబ్బతిన్నాయి. వారికి టార్పాలిన్ పట్టలు, వంట సామగ్రి, దోమ తెరలను రెడ్‌క్రాస్ అందచేసింది. రెడ్‌క్రాస్ పాలకవర్గం చైర్మన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విపత్తు సమయాలలో బాధితులకు ఎప్పుడు రెడ్‌క్రాస్ అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి వైస్ చైర్మన్ చామర్తి జనార్దన్ రాజు, క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్ యాలమూరి రంగారావు, విపత్తుల నిర్వహణ విభాగం కో ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి నిసా అవార్డు



అవార్డు అందుకుంటున్న సుబ్బారెడ్డి

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో మూడు దశాబ్దాలు ఉత్తమ సేవలందించినందుకు నగరంలోని శ్రీనేతాజీ పైలట్ స్కూల్ చైర్మన్ ఎంవీ సుబ్బారెడ్డి ఈ ఏడాది నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్(నిసా) అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అక్కడి ఎంపీ భరత్ ఈ అవార్డును అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నిసా అధ్యక్షుడు కులభూషణ్ శర్మ, అపస్మా చీఫ్ మెంటర్ కృష్ణారెడ్డి, ఏపీ అధ్యక్షుడు తులసి విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు. సుబ్బారెడ్డికి పలువురు కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

సోమిరెడ్డి నివాసంలో ఉపసభాపతికి విందు



రఘురామకు భోజనం వడ్డిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పర్యటనకు వచ్చిన ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమ రాజుకు అల్లీపురంలోని తన నివాసంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విందు ఏర్పాటు చేశారు. సర్వేపల్లి టీడీపీ శ్రేణులతో కలిసి సాదర స్వాగతం పలికారు. జిల్లా రాజకీయాలు, విశిష్ట ఆధ్యాత్మిక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, వంటల్లో ప్రఖ్యాతిగాంచిన రుచులు వంటివి ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జడ్ శివ ప్రసాద్, బొమ్మి సురేంద్ర పాల్గొన్నారు.

నవంబరు 22 నుంచి జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు



సాంస్కృతికోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాహితీ ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాంస్కృతిక మహోత్సవాలు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నవంబరు 22, 23తేదీ ల్లో జరగనున్నాయి. వీటికి సంబంధించిన కరపత్రాలను నగరంలోని రాంజీనగర్ సాహి తీ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిన్ని నారాయణరావు, దేశంలోని అన్నీ రాష్ట్రాల నుంచి కవులు, రచయితలు, కళాకా రులు, కార్టూనిస్టులు పాల్గొంటారని తెలిపా రు. ఈ కార్యక్రమంలో కమిటీ యామినేని వెంకటరమణ, గోవిందరాజుల సుభద్రాదేవి, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, పవన్‌కుమార్, చొప్పా రాఘవేంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరంతో అనుమానాల నివృత్తి

● కమిషనర్ నందన్



బాధితుల సమస్య తెలుసుకుంటున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణాల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఓపెన్ ఫోరం ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో సిటీప్లానింగ్ విభాగం నేతృత్వంలో ఓపన్ ఫోరం నిర్వహించారు. నగర వ్యాప్తంగా 15 మంది తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారని పేర్కొన్నా రు. ప్రతీ శుక్రవారం ఈ ఫోరం జరుగుతుందని తెలిపారు. సీపీ హిమబిందు, డీసీపీ రఘునాథరావు, ఏసీపీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సండేమార్కెట్ వద్ద పారిశుధ్య పనులను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు.

జాతీయ క్రికెట్‌లో 'నారాయణ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్‌లోని జలంధర్‌లో యూత్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో నారాయణ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. నగరంలో హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో శుక్రవారం విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ విజయాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన కుశ్వంత్, మన్సూర్, మనోజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మధుసూదన్‌రెడ్డి, కోర్ డీన్ శ్రీనివాసులు, డీన్ వర్ధని, ప్రిన్సిపాల్స్ నాగార్జున, లక్ష్మయ్య, కామాక్షి, కోచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి కోసం 16 ఏళ్లుగా పోరాటం

● ఫ్లైవోవర్ సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు



నిరసన తెలుపుతున్న కమిటీ సభ్యులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్ పార్క్, చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అండర్ ప్రాస్ బ్రిడ్జి నిర్మించాలని 16 ఏళ్లుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని ఫ్లైవోవర్ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. మరెంతో మంది వికలాంగులయ్యారని చెప్పారు. వెంటనే అండర్ ప్రాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, పెంచల నర్సయ్య, శంకర్, కొట్టే రామ్మూర్తి, గురుబ్రహ్మం, శివకుమార్‌రెడ్డి, పరశురామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, షంషుద్దీన్, కట్టా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని తొలగించి గుంతలు పూడుస్తాం : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై గుండ్లపాళెం వద్ద వర్షానికి భారీగా నీళ్లునిలిచిన ప్రాంతాలను యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరిస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రజల ఫిర్యాదులతో రోడ్లు, భవనాల అధికారులతో కలిసి దెబ్బతిన్న ప్రదేశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దత్తాత్రేయ, చక్రవర్ధన్‌రెడ్డి, కుంచాల విజయభాస్కర్ పాల్గొన్నారు.



ముత్తుకూరు రహదారిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

అత్తను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అత్తను చంపి, అమె చెవిలో ఉన్న దుద్దులు దొంగతనం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కలిగిరి మండలం జి్రావారిపాళెంకి చెందిన గుంటుపల్లి నారాయణకి జీవిత ఖైదుతోపాటు రూ. రెండు వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ప్రత్యేక మహిళా కోర్టు) ఎంఏ. సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, బుచ్చి మండలం వవ్వేరుకి చెందిన కొండమ్మను కలిగిరి మండలం జిర్రావారిపాళెంకు చెందిన నారాయణకు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి అయినప్పటి నుంచి నారాయణ చెడు వ్యసనాలకు లోనై భార్యను వేధించేవాడు. దాంతో అమె తన పిల్లలను తీసుకుని ఐదేళ్ల క్రితం పుట్టిల్లు వవ్వేరుకి వచ్చి చేరింది. ఈనేపథ్యంలో జిర్రావారిపాళెంలో ఒంటరిగా ఉన్న తన భర్తకు అనారోగ్యమని తెలిసి తన ఇంటికి పిలిపించుకుంది. నారాయణకు ఆరోగ్యం మెరుగుపడ్డాక ఆయన స్వగ్రామానికి వెళ్లాడు. మళ్లీ కొంతకాలానికి సంక్రాంతికి కొండమ్మ తన భర్తను ఇంటికి పిలిచింది. దాంతో నారాయణ 2023 జనవరి 15న తన భార్య వద్దకు వచ్చాడు. ఈ నేపథ్యంలో 2023 జనవరి 18న నారాయణ తన అత్త గద్దె సుబ్బమ్మ ఇంటిలో ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. మద్యం సేవించి ఉన్న నారాయణ తన అత్త సుబ్బమ్మను రోకటి బండతో గట్టిగా కొట్టి హత్య చేశాడు. అనంతరం అమె చెవిలో ఉన్న బంగారు కమ్మలను, చేతికి ఉన్న ఉంగరాన్ని దోచుకుని పరారయ్యాడు. భర్త నారాయణపై బుచ్చి పోలీసులకు కొండమ్మ ఫిర్యాదు చేసింది. కేసు విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రఫీ మాలిక్ వాదించారు.

జిల్లాను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలుపుదాం

● కలెక్టర్‌తో మంత్రి ఆనం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సూచించారు. శుక్రవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురుగతిపై వారు చర్చించారు.

● ఆనంను కలిసిన లంకా దినకర్

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మంత్రి ఆనంను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ కేంద్ర పథకాలు, పలు కార్యక్రమాలపై చర్చించారు.

సైకో జగన్ బాలయ్యను విమర్శించడమా..?

● నుడా చైర్మన్ కోటంరెడ్డి


మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక సైకోలా నందమూరి బాలకృష్ణను విమర్శించటం ఏమిటని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నీచ, రౌడీ, దోపిడీ సంస్కృతితో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్, 50 ఏళ్లుగా కళామతల్లి సేవలో ఉన్న బాలయ్యను విమర్శంచడం తగదన్నారు. అసెంబ్లీలో బూతుల సంస్కృతిని ప్రోత్సహించింది నీవు కాదా జగన్ అని ప్రశ్నించారు. ఆస్తికోసం తల్లిని, చెల్లిని గెంటేశావ్, రాజకీయాల కోసం బాబాయిని హత్య చేయించావని విమర్శించారు. తాగుబోతులా జగన్ మాట్లాడుతున్నాడని, ముందు ఆయన మానసిక స్థితిని చక్కదిద్దుకోవాలని సలహా ఇచ్చారు.

విస్తరిస్తున్న

గడ్డి జ్వరం కలవరం

స్క్రబ్ టైఫస్


స్క్రబ్ టైఫస్ వ్యాధిగ్రస్తుడు, వ్యాధికి కారణమయ్యే కీటకం

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో ఐదుగురు వ్యాధిగ్రస్థులు నమోదు అయ్యారు. వెంటనే చికిత్సలు అందించగా వారు కోలుకుంటున్నారు. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ భాస్కర్‌రావు, ఎపిడమాలజీ సెల్ ప్రాజెక్టు డైరెక్టర్

వ్యాధిపై ఆందోళన వద్దు



స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. వ్యాధికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా పిల్లలపై ప్రభావం ఉంటుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

● జిల్లాలో ఇప్పటికే ఐదు కేసుల నమోదు

● నిర్లక్ష్యం చేస్తే కోమాలోకి...

● అరుదుగా వచ్చే వ్యాధితో ఆందోళన

● లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి (గడ్డి జ్వరం లేదా జంగిల్ ఫీవర్) ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. నల్లిని పోలి ఉండే కీటకం వల్ల వస్తున్న ఈ వ్యాధిని నిర్లక్ష్యం వహిస్తే వ్యాధిగ్రస్థులు కోమాలోకి వెళ్లే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాలా అరుదుగా వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం జిల్లాలోనూ వెలుగు చూస్తోంది. ఇప్పటికే ఐదుగురు ఈ వ్యాధినపడి చికిత్స పొందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఐదు కేసులు నమోదు కావటం వైద్య ఆరోగ్యశాఖలో కలవరం రేకెత్తిస్తున్నది.

● లక్షణాలు కనిపిస్తే డాక్టర్ని సంప్రదించాలి

ఈ వ్యాధి సోకితే డెంగీ తరహాలో తీవ్రమైన కండరాల నొప్పి, తలనొప్పి ఉంటాయి. అలాగే జీర్ణ సంబంధింత వ్యాధుల లక్షణాలు కనిపిస్తాయి. ఆయా లక్షణాలు గమనించి వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి. నిర్లక్ష్యం వల్ల శరీరంలోని పలు అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇంట్లోనే నక్కినల్లిని పోలే ఈ చిన్న కీటకం ఎక్కువగా పిల్లలపై ప్రభావం చూపుతుంది.

● జాగ్రత్తలు తప్పనిసరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లు లాంటివి తీసివేయాలి. పిల్లలకు కాళ్లు, చేతులు ఉప్పి ఉంచేలా దుస్తులు వేయడం వల్ల ఈ కీటకానికి దూరంగా ఉండవచ్చు. ఊపిరితిత్తుల్లో వాపు వచ్చి ఊపిరి తీసుకోవటం ఇబ్బందిపై ఉంటే స్క్రబ్ టైఫస్ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. మెదడులోని రక్షిత పొరల్లో వాపు రావటం వల్ల తీవ్రమైన నరాల సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. మూత్ర పిండాల వ్యాధుల తో ఈ వ్యాధివల్ల వచ్చి ప్రాణాపాయానికి దారి తీసే అవకా శం, గుండె కండరాల వాపు వచ్చే అవకాశం ఉంటుంది.

● ఐదు కేసుల నమోదు

గత నెలలో నెల్లూరు వెంకటేశ్వరపురం, ఎన్టీఆర్ నగర్‌లో వ్యాధిగ్రస్థులు నమోదయ్యారు. ఈనెలలో మనుబోలు, కావలి, తోటపల్లి గూడూరుకి చెందిన ఒక్కొక్కరు వ్యాధి బారిన పడారు. వీరంతా చిన్న పిల్లలే కావటం తల్లిదండ్రుల్లో ఆందోళన రెకెత్తిస్తుంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధి బాధితుల నివాసాలు ఉండే చుట్టు పక్కల ఎవరైనా ఈ వ్యాధికి గురయ్యారా..? అనే విషయాన్ని క్షణ్ణంగా పరిశీలిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వీల్‌పెలిక్స్ పరీక్ష చేస్తున్నారు. అయితే అనుమానితుల్లో వ్యాధిగ్రస్థులు లేరని నిర్ధారించుకుని ఊపిరి వైద్యాధికారులు పీల్చుకున్నారు.

నేడు నాగుల చవితి

● ఆలయాలు, పుట్టల వద్ద ఏర్పాట్లు

● నోములు, వ్రతాలు చేయనున్న మహిళలు



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం వివిధ ఆలయాలు, పలు ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యే ఈ పండుగకు భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలను నిర్వాహకులు కల్పించారు. ఆలయాలు, పుట్టల వద్ద విద్యుత్ అలంకరణ, క్యూలైన్లు, తాగునీరు, ఉచిత ప్రసాదాల వితరణకు ఏర్పాట్లు చేశారు. కార్తీక, శ్రావణ మాసాల్లో చతుర్ధశి రోజున సర్పాలను పూజించడం వల్ల పుణ్యం, సౌభాగ్యం, ఆరోగ్యం, సంతానం లాంటి ఫలితాలు లభిస్తాయని పురాణ కథనం. అలాగే కుజ, కాలసర్ప దోషం, రాహు, కేతు గ్రహాల దోషాలు తొలగాలంటే కఠిన ఉపవాసంతో నాగుల చవితి నోములు నోస్తారు. నాగులను పూజించడం వల్ల సర్ప దోషాలు, రోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భక్తుల నమ్మకం. పొలాల్లో పుట్టల వద్ద నాగుల చవితి సందర్భంగా పూజలు చేయడం వల్ల పంటలను నాశనం చేసే ఎలుకలను నాగులు నివారిస్తాయని భక్తుల విశ్వాసం. మానవ శరీరాన్ని పుట్టతో పోలుస్తారు. పుట్టలో 9 రంధ్రాలు ఉన్నట్లే మానవ శరీరంలోనూ 9 రంధ్రాలు ఉంటాయిని భావిస్తుంటారు. నాగుల చవితి పూజలు, నోములను ఎక్కువగా మహిళలే ఆచరిస్తారు. దీపావళి అనంతరం కార్తీక శుద్ధ చవితిరోజున నాగుల చవితిని జరుపుకుంటారు.

నుడా వైస్ చైర్మన్‌గా జేసీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నుడా కార్యాలయంలో శుక్రవారం నుడా వైస్ చైర్మన్‌గా జేసీ మొగిలి వెంకటేశ్వర్లు బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయనకు అభినందలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన జేసీకి పుష్పాగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. నుడా అభివృద్ధి దిశగా పయనించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నుడా పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరిపాలనతో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని వైస్ చైర్మన్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నుడా అభివృద్ధి పథంలో పయనించేందుకు వైస్ చైర్మన్ అనుభవం, మార్గదర్శకత చాలా కీలకం కానుందన్నారు.

'ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్' పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూలో శుక్రవారం సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సమైక్య పాదయాత్రకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 'ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సమైక్య పాదయాత్ర పోస్టర్లను విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ దార్శనికతను స్మరించుకుంటూ 'ఒక దేశం- ఒకే దృక్పథం' అనే భావన ప్రతిబింబించేలా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31న ఉదయం 8 గంటలకు నెల్లూరులోని వీఆర్‌సీ మైదానం నుంచి వేదాయపాలెం వరకు జరిగే పాదయాత్రలో విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, జిల్లా యువజన అధికారి మహేందర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రొఫెసర్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ ఎస్‌టీ సాయినాథ్, డాక్టర్ వై విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఉదయగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం డిపోలో శనివారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం రమేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 9959225095 అనే నెంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలన్నారు. డిపో పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ పరీక్షలలో ఇద్దరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో 15,421 మంది విద్యార్థులకుగాను 14,391 మంది హాజరు కాగా మిగిలిన 1030 మంది గైర్హాజరయ్యారు. సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

రేపు పెన్షనర్స్ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం నెల్లూరులోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో ఉదయం 9.30గంటలకు జరుగుతుందని తెలిపారు. డీఆర్, 11వ పీఆర్‌సీ బకాయిలు, కొత్తగా మంజూరైన డీఆర్ విడుదల తదితర అంశాలపై చర్చిస్తామని, అనంతరం డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో షుగర్ వ్యాధిపై అవగాహన కోసం తియ్యని ముప్పు అనే నాటికను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని పెన్షనర్లు హాజరుకావాలని కోరారు

రేపు వెటరన్ అథ్లెటిక్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లాలో డిసెంబర్ 13, 14 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఎవరినీ దస్తావేజు లేఖరులుగా నియమించలేదు

● జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎవ్వరినీ దస్తావేజు లేఖరులుగా నియమించలేదని, ఎవ్వరికీ దస్తావేజు లేఖరులుగా లైసెన్సు ఇవ్వలేదని రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమకు తామే ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో చలానాలు చెల్లించి కావాల్సిన సమయంలో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా సబ్ రిజిస్ట్రార్‌లను సంప్రదించి దస్తావేజులను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. నిషేధిత భూముల జాబితా, మార్కెట్ విలువలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, స్పెషల్ వివాహాల కోసం ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

27న ఈపీఎఫ్ సమావేశం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న నెల్లూరులో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి డీ కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్య నిధి చెల్లించే ఉద్యోగులు ఈ పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో సరస్వతీనగర్‌లోని కృష్ణ చైతన్య జూనియర్ కాలేజీలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈపీఎఫ్‌కు సంబంధించిన నగదు తీయడం, జమ చేయడం, క్లైమ్స్ పెండింగ్ వంటి అన్ని సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టా



నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కట్టా సుబ్రమణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నుంచి తిరుపతిలో జరుగుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ 13వ రాష్ట్ర మహాసభల్లో శుక్రవారం సుబ్రహ్మణ్యం ఎన్నిక జరిగింది. 1989లో ఆర్టీసీలో చేరిన ఎస్‌డబ్ల్యూఎఫ్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

లంచాల కోసం పీడించొద్దు!

● మీ అవినీతి ఆధారాలు నా దగ్గరున్నాయి..! ● రిజిస్ట్రేషన్ అధికారుల సమీక్షలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి


రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (రూరల్/వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆస్తుల క్రయ, విక్రయాలు జరిపేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే పేద ప్రజల వద్ద లంచాలు డిమాండ్ చేయవద్దు.. మీ అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు నా దగ్గరున్నాయి.. జాగ్రత్తగా ఉద్యోగాలు చేసుకోండి అంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సబ్ రిజిస్ట్రార్లను హెచ్చరించారు. జిల్లా రిజిస్ట్రార్ ఆంజనేయులతో కలిసి నెల్లూరులోని పలువురు సబ్‌రిజిస్ట్రార్లతో ఆయన నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు వారి అవసరాల కోసం ఆస్తులు అమ్ముకోవడం, కొనుగోలు చేయడం జరుగుతుందని, వారిని లంచాల కోసం పీడిస్తే ఊరుకోనని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తనవద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. జాగ్రత్తగా వ్యవహరించకపోతే అవన్నీ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్లపై విజిలెన్స్ విచారణ జరపాలి

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల తీరుపై విజిలెన్స్ విచారణ జరపాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు లీలా మోహన్, నందిపోగు రమణయ్య విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారి రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారని ఆరోపించారు. నగర నడిబొడ్డున ఉన్న రూ.1.50 కోట్ల ఇరిగేషన్ స్థలానికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి స్వాహా చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదో అర్థం కావటం లేదన్నారు. అక్రమాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆ ధారాలు తన వద్ద ఉన్నాయని చెబుతున్న రూ రల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ఆ ఆధారాలను బయటపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్, తల్లు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బానాయుడు మృతి టీడీపీకి తీరని లోటు

● మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారాయణ


మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, తదితరులు

దగదర్తి(బిట్రగుంట), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు హఠాన్మరణం పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి మాలేపాటి స్వగృహానికి వెళ్లిన మంత్రి నారాయణ మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బానాయుడు సోదరులు రవీంద్రనాయుడు, సుధాకర్‌నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బానాయుడు ఆలస్యంగానైనా కోలుకుని క్షేమంగా బయటకు వస్తారని భావించామన్నారు. హఠాత్తుగా మృతి చెందుతాడని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆత్మీయంగా ఉండే సుబ్బానాయుడుని కోల్పోయినందుకు బాధగా ఉందన్నారు. అలాగే టీడీపీ కార్యక్రమాల్లో బాబాయి సుబ్బానాయుడుకు తోడుగా ఉండి చురుగ్గా పనిచేసే టీడీపీ యువనేత భానుచందర్‌నాయుడు అకాలమృతి మనస్సుకు బాధ కలిగించిందన్నారు. భానుచందర్ మృతి చెందిన 24 గంటల్లోనే సుబ్బానాయుడు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, మాలేపాటి కుటుంబ సభ్యులకు మనోధైర్యాని భగవంతుడు ప్రసాదించాలని మంత్రి కోరారు. వారి వెంట సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, స్థానిక టీడీపీ నాయకులు, మాలేపాటి అభిమానులు, తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి : డీఈవో


మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంపొందించేలా సిబ్బంది పనిచేయాలని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు సూచించారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లెవల్-1 మాస్టర్ ట్రైనర్స్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు టీచ్ టూల్ ప్రాముఖ్యతను తెలుసుకుని, విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనా పద్ధతులను మెరుగు పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, జిల్లా కోఆర్డినేటర్ షకీల్, 60 మంది మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రెగ్యులర్ పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు(ఓల్డ్ సిలబస్) ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిం చినట్లు డీఈవో ఓ ప్రకటనలో తెలిపారు. apopen-s-c-hoo-l.a-p.-go-v.in వెబ్‌సైట్‌లో రూ.300 ఫీజుతో అడ్మిషన్ పొందవచ్చుని, ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ద్వారా కూడా ప్రవేశం పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు పాఠ శాలల ప్రధానోపాధ్యాయులనుగానీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోగానీ సంప్రదించాలని కోరారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావుకు పల్లిపాడు డైట్ ప్రిన్సిపాల్(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కే వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయడంతో పరిపాలనపరమైన ఇబ్బందులు రాకుండా గతంలో డైట్‌లో సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించి, ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న బాలాజీరావును వెంటనే అదనపు బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి


మన్నేటికోట పునరావాస కేంద్రంలో అధికారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

ఉలవపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలించాలని కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని లోతట్టు ప్రాంతాలు, వరద నీరు భారీగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా తిరుపతి కుంట ఎస్టీ కాలనీవాసులను జీపీఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మన్నేటికోటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అధికారులు కల్పించిన వసతులను పరిశీలించారు. మండలంలోని భీమవరం, బద్దిపూడి, మన్నేటికోట, ఆత్మకూరు, ఉలవపాడు, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దళిత కూలీ బిడ్డకు డాక్టరేట్

● సత్కరించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని లింగంపల్లి అరుంధతీయవాడకి చెందిన దళిత కూలీ బిడ్డ గార్ల వెంకటేశ్వర్లు ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. విషయం తెలుసుకున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన నివాసంలో వెంకటేశ్వర్లును శాలువా, పుష్పగుచ్ఛంతో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, తల్లిదండ్రులు వెంకటస్వామి, పద్మమ్మ వీరేపల్లి పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ ఉత్సవాలు

సీతారామపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకలవారిపల్లి గ్రామంలో శనివారం నుంచి 29వ తేదీ వరకు పోలేరమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం గణపతిపూజ, పుట్ట బంగారం, ఆదివారం సీతారాముల కల్యాణం, సోమవారం వసంతోత్సవం, మంగళవారం పోలేరమ్మ జాతర, బుధవారం గ్రామ దేవతకు పొంగళ్ళు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11704
వెండి కిలో ధర	రూ. 152242
వెండి ఒక గ్రాము	రూ. 158.20

న్యూస్ బాక్స్

సంగం పీహెచ్‌సీ తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో డాక్టర్ పర్వీనా సుల్తానా

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు తరుణవాయి విలేజ్ హెల్త్ సెంటర్‌ను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం రీజనల్ అధికారి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ పర్వీనా సుల్తానా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె తల్లీబిడ్డల ఆరోగ్యం, గర్భిణులకు చేయు రక్తపరీక్షల గురించి వైద్యులు సమ్మెలో ఉండడంతో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులతోపాటు స్థానిక సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, సూపర్‌వైజర్‌లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ట్రైనీ వైద్య విద్యార్థులు ఉన్నారు.

మాలేపాటి కుటుంబానికి పరామర్శ

దగదర్తి(బిట్రగుంట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దగదర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం శుక్రవారం మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కళాశాల అభివృద్ధికి దివంగత రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, దివంగత యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు చేసిన సేవలు మరువలేనివన్నారు. అటువంటి వారిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

పోలియో నిర్మూలనే ధ్యేయం

వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాశిలామణి ఆసుపత్రిలో శుక్రవారం పోలియో నిర్మూలన దినోత్సవం సందిరెడ్డి మాలకొండరాయుడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు గొడుగు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మాశిలామణి పాల్గొని మాట్లాడుతూ పోలియోరహిత సమాజం నిర్మించేందుకు పోలియో డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాశిలామణిని ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణపురం సుదర్శనరెడ్డి, ఎమ్మెస్ నాయుడు ట్రస్ట్ సభ్యులు, హాస్పిటల్ చైర్మన్ నిర్మల, డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచు మృతి

కొండాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ మాజీ సర్పంచు షేక్ ఖాజా రంతుల్లా(65) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. గండెలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పడంతో వెంటనే చికిత్స నిమిత్తం కారులో కావలికి తరలిస్తుండగా గ్రామ సమీపంలో ఉన్న గండి కట్ట చెరువు అలుగు పారుతుండంటో వెళ్లేందుకు వీలులేక సుమారు గంటకు పైగా అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. వెనుకకు వెళ్లినా సత్యవోలు గ్రామం దగ్గర మిడతవాగు ఉధృతంగా పారడంతో అటువైపు రాకపోకలు నిలిచిపోయాయన్న సమాచారం అందడంతో చేసేదేమిలేక అక్కడనే ఆగడంతో ఆయన మరణించారు. భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా అత్యవసర పరిస్థితులలో వైద్యశాలకు వెళ్లాలంటే నీరు పారేచోట బ్రిడ్జిలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దెబ్బతిన్న రహదారి సేఫ్టీ గార్డు పునరుద్ధరణ


రహదారి పక్కన సేఫ్టీ గార్డ్‌ను ఏర్పాటు చేస్తున్న హైవే సిబ్బంది

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ దిగువ భాగంలో ముంబాయి రహదారి పక్కన దెబ్బతిన్న సేఫ్టీగార్డు పునరుద్ధరణ పనులను రహదారి హైవే అధికారులు శుక్రవారం చేపట్టారు. ఇటీవల సంగం కొండ రహదారి కూడలి సమీపంలో ఓ లారీ అదుపుతప్పి సేఫ్టీగార్డును ఢీకొంది. దీంతో సేఫ్టీగార్డు ధ్వంసమైంది. దీంతో రహదారి హైవే అధికారులు సేఫ్టీగార్డు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

- స్తంభించిన రాకపోకలు
- ప్రజల అవస్థలు


ఏఎస్ పేట: ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కలవాగు


సంగం : ట్రాక్టర్‌లో బీరాపేరు వాగు దాటుతున్న విద్యార్థులు


కావలి రూరల్: ఉదయగిరి బ్రిడ్జి దగ్గర స్తంభించిన ట్రాఫిక్

ఏఎస్ పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు పొంగి రోడ్లపైకి వర్షం నీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గుడిపాడు గ్రామ సమీపంలోని బీరాపేరు వాగు ప్రవాహం అధికంగా ఉండడంతో గుడిపాడు గ్రామానికి రాకపోకలు నిలిచాయి. అదేవిధంగా ఏఎస్‌పేట సమీపంలోని నక్కలవాగు ప్రవాహం పెరిగి వంతెనపై నుండి ప్రవహిస్తుండంతో ఏఎస్ పేట నుండి చందులూరుపాడు, జమ్మవరం, చిరమన, హసనపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రవాహం అధికంగా ఉండడంతో వంతెనపై రాకపోకలు సాగించరాదని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. వాగుల వద్ద పోలీసులను ఏర్పాటుచేసి ఎవరు వాగులో దిగకుండా జాగ్రత్తలు చేపట్టారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బీరాపేరు వాగు

● **సంగం:** మండలంలోని పెరమన రహదారిపై ప్రవహించే బీరాపేరు వాగు శుక్రవారం సాయంత్రానికి మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ బీరాపేరు వాగును పరిశీలించి రాకపోకలు సాగించకుండా కంపతో అడ్డుకట్ట వేశారు. ఉదయం సంగంలోని ఉన్నత పాఠశాలకు వచ్చిన పెరమన విద్యార్థులను ట్రాక్టర్‌లో పెరమన గ్రామానికి తరలించారు. అయితే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామస్థులెవరూ వాగు దాటి రావద్దని, అత్యవసరమైతే చిరమన మీదుగా తిరిగి రావాలని సూచించారు. వాగు వద్ద పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

● **కావలిరూరల్:** భారీ వర్షానికి శుక్రవారం అన్నపుగుంట నిండి తూముల గుండా నీరు ప్రవహించడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపవని రోడ్డులోని గ్రామాలతో పాటు పాఠశాల విద్యార్థులు, వైకుంఠపురం, జనతాపేట ప్రాంత వాసుల రాకపోకలతో రద్దీగా ఉండే ఆమార్గంలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో వాహనాలు ఉదయగిరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వైపు మళ్లాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతులు జరుగు తుండడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దీంతో బ్రిడ్జిపై మరమ్మతులు జరుగుతున్న ప్రాంతంలో బారికేడ్లు పెట్టి వాహనాలను ఒకవైపు ఆపుతూ మరోవైపు పంపుతూ మరమ్మతులు చేపట్టారు.

వాగులు, చెరువుల పరిశీలన


బీరాపేరు వాగు ప్రవాహన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని పలు వాగుల కలుజులు ప్రవహిస్తుండడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల టీడీపీ నాయకులు కలుజులను పరిశీలించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. నీరు ప్రవహించే కలుజులపై రాకపోకలు సాగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు :** డివిజన్‌లోని పలు చెరువులను శుక్రవారం ఆత్మకూరు డివిజన్ ఇరిగేషన్ ఈఈ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని 225 చెరువుల్లో అత్యధిక శాతం చెరువులన్నీ వర్షపునీటితో నిండుకున్నాయన్నారు. ప్రస్తుతం చెరువులన్నీ పటిష్టంగా ఉన్నాయని, ఎలాంటి సమస్యలు లేవన్నారు.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ

అనంతసాగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల నుంచి దిగువకు భారీగా వరద నీరు వదులుతున్న క్రమంలో పెన్నా సమీప గ్రామాల్లో ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించామని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. సీఐ గంగాధర్‌తో కలసి సోమశిల ప్రాజెక్టును ఆయన శుక్రవారం సందర్శించారు. వస్తున్న వరద, దిగువకు వదులుతున్న నీటి ప్రవాహం వివరాలను తెలుసుకొని జలాశయ ఉద్యోగులు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరద తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నీటి మడుగులో పాఠశాల ఆవరణ

● విద్యార్థుల నిరసన


నీటిలో దిగి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాయపాళెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో వర్షపు నీరు చేరడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి నెలకొంటుందని, అంతేకాకుండా ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఏకైక తరగతి గది శ్లాబు వర్షాలకు ఉరుస్తోంది. దీంతో విద్యార్థులు శుక్రవారం నీటిలో దిగి నిరసన తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆత్మకూరు నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పంట నష్టాలను వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాని కోరారు.

28న ప్రజాఉద్యమ ర్యాలీని విజయవంతం చేయండి

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న ప్రజాఉద్యమం ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నియోజకవర్గ పరిశీలకుడు పేర్నాటి కోటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన ప్రజాఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

బిట్రగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులతో పాటు ఆరోగ్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచిం చారు. క్షయ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన లక్ష్యాన్ని సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు జిహారిక, నిత్య ప్రశాంతి, డీవీఎస్ శ్రావణ్, హెల్త్ సూపరవైజర్, హెఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి పక్కాగృహం మంజూరుకు చర్యలు


ఇంటి యజమానురాలితో మాట్లాడుతున్న అధికారులు, టీడీపీ నాయకులు

ఉదయగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో కూలిన షాహిద నివాసాన్ని శుక్రవారం గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ షేక్ పీరాన్, ఇన్‌చార్జి ఏఈ షరీఫ్‌లు టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కూలిన ఇంటిని పరిశీలించి వారికి పీఎంవైజీ పథకం పక్కాగృహం మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వర్షానికి దెబ్బతిన్న మరో రెండు ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, సయ్యద్ సందానీ, వర్కు ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఉదయగిరి: ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉదయగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఎంఈవో టీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల్లో కొందరు విద్యార్థులు ఆధార్ పొందకపోవడం, నవీకరణ చేసుకోకపోవడంతో వారి సౌకర్యార్థం కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కేంద్రం ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, నూతనంగా ఆధార్‌కార్డు కోసం, చేర్పులు, మార్పుల కోసం కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు:** విద్యార్థుల ఆధార్ నమోదుకు స్థానిక బాలికల హైస్కూల్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వింజమూరు మండలానికి చెందిన 1400 మంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బాలుర హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికలు హైస్కూల్‌లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారును సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన స్థానిక తహసీల్దారు సోమ్లానాయక్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దాడి భాను కిరణ్ శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అన్నారెడ్డిపాలెం, సంగం జనసేన పార్టీ నాయకులు సబ్బు భాను, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

వర్షాలతో నీట మునిగిన వరి పైరు

నష్టాల ఊబిలో అన్నదాతలు


కలువాయి : నీటమునిగిన వరిపైరును చూపుతున్న రైతులు


సీతారామపురం : సింగారెడ్డిపల్లిలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

కలువాయి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజలుగా కురుస్తున్న వర్షాలకు తోడు చెరువు అలుగునీరు వచ్చి పొలాలపై పడటంతో కలువాయి మండలం కుల్లూరు, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట నీట మునిగింది. నేలవాలిన పంట నీటిలో ఉండటంతో గింజలు మొలకెత్తున్నాయి. దీంతో అన్నదాతలు లబోదిబో మంటున్నారు. కుల్లూరు, వెంకటరెడ్డిపల్లిలో వరికోతలు జరుగుతున్నాయి. ఇంకా సుమారు 400 ఎకరాల్లో పంట కోయాల్సింది ఉంది. ఈ సమయంలో వర్షాలు కురవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న వరి పైరు పరిశీలన

● **సీతారామపురం:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని పబ్బులేటిపల్లి, సంగసానిపల్లి, సింగారెడ్డిపల్లి, సీతారామపురం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి పరిశీలించారు. వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పొలాల్లో అధికంగా ఉన్న వర్షపు నీటిని తొలగించాలన్నారు. వర్షాలు ఆగే వరకు కోతకు వచ్చిన వరి పంటను కోయవద్దని సూచించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలపై ప్రాథమిక సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. వారి ఆదేశానుసారం వర్షాలకు 33 శాతం కంటే ఎక్కువగా పంట నష్టం జరిగితే నష్టపరిహారం అందేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ముళ్లపొదల్లో వ్యక్తి మృతదేహం

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారంపేట గ్రామ సమీపంలో ఎంఎస్‌ఎంఈ పార్కు, నేషనల్ హైవే మధ్య ముళ్ల పొదల్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు, వీఆర్వో కె సాయికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్య శాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని పేర్కొన్నారు.

శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

ఏఎస్ పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరమన గ్రామంలోని శివాలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు త వ్వకాలు జరిపారని గ్రా మస్థులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోకి ప్రవేశించి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తాళాలు పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి ఒక రాయిని సైతం తొలగించారు. తవ్వకాలు జరిపే సమయంలో శబ్దాలు రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు లేచి గుడి దగ్గరకు వచ్చి చూడగా దుండగులు అక్కడ నుండి పారిపోయారు. దీనితో గ్రామ స్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంగం సీఐ వేమా రెడ్డి, ఏఎస్ పేట ఎస్‌ఐ సైదులు, సంగం ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ అరెస్ట్

● బెదిరించి నగదు దోచుకున్న కేసులో చర్యలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చంపుతానని పండ్ల వ్యాపారిని బెదిరించి నగదు దోచుకున్న కేసులో బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌కు చెందిన కావలి మహేష్ సంవత్సర కాలంగా మద్రాసు బస్టాండు కూరగాయల మార్కెట్ సమీపంలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద శోధన్‌నగర్‌కు చెందిన కృష్ణసింగ్ తరచూ పండ్లు కొనుక్కున్నేవాడు. గురువారం రాత్రి వహాబ్‌పేటలోని పెట్రోల్‌బంకు వద్ద మహేష్ పండ్లు అమ్ముతుండగా కృష్ణసింగ్ అక్కడికి వెళ్లి మద్యం తాగేందుకు రూ.వెయ్యి ఇవ్వమని అడిగాడు. ఆయన డబ్బులు లేవని చెప్పడంతో పక్కనే దొరికిన ఖాళీ బీర్‌బాటిల్‌ను పగులగొట్టి డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. మహేష్ భయంతో నగదు ఇచ్చాడు. విషయాన్ని గమనించిన మహేష్ స్నేహితులు తైసిఫ్, మహబూబ్ అక్కడికి రావడాన్ని గమనించిన కృష్ణసింగ్ పరారయ్యాడు. బాధిత పండ్ల వ్యాపారి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి శుక్రవారం నిందితుడుని అరెస్ట్ చేశారు.

మహిళ బలవన్మరణం

నెల్లూరు (సిటీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సహజీవనం చేసే వ్యక్తితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరు రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన రాజేశ్వరి (40) భర్తకు దూరమై జేజేపేటకు చెందిన భానుచందర్‌తో అల్లీపురం వద్దనున్న టిడ్కో గృహాల్లో సహజీవనం చేస్తోంది. భానుచందర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇరువురి మధ్య మనస్పర్థలు, ఆర్థిక లావాదేవీల కారణంగా రాజేశ్వరి గురువారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పాలధారల వాన.. పెంచలకోన!



ఉదయసంధ్యల్లో ప్రత్యక్షమయ్యే 'ఆకుపచ్చని' స్వర్గాన్ని మీరెప్పుడైనా చూశారా? ఆకాశపు అంచులు తాకే కొండ శిఖరాలను అందుకున్నారా..? మంచు కొండలను ముద్దాడే మేఘాల అద్భుత సౌందర్యాన్ని ఆస్వాదించారా..? చూపుల తీరాల్లో ఏపుగా ఎదిగిన మహా వృక్షాల రహస్యాలు మీకు తెలుసా? స్వచ్ఛమైన పాలధారల వానలో ఒక్కసారైనా తడిసి ముద్దయ్యారా? హృదయ వీణను మీటుతూ.. నింగినుండి జాలువారే జలపాతపు చప్పుళ్లు వినిపిస్తున్నాయా? ఆ.. పక్కనే ప్రవహించే పుణ్యఫలదాయిని.. కణ్వ నదీమ తల్లి ప్రసాదించే కమనీయ అలల తుంపరలను భక్తితో కళ్లకద్దుకున్నారా? నేల తల్లి పాదాల వద్ద ప్రారంభమై.. లక్షలాది అడుగుల పాతాళ లోకపు ప్రచండ లోయల పర్యావరణ ప్రయాణానికి మీరు సిద్ధమా? అయితే.. రండి.. తనువును.. మనసును పులకింపజేసే చలచల్లని 'వర్ష రుతువు' సాక్షిగా.. ప్రకృతి రమణీయ దృశ్య ప్రపంచంలోకి 'పెంచలకోన అందాలు' మీకు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్నాయి. మరపురాని ఈ రమణీయ జలపాతపు సొగసులను తిలకించేందుకు నెల్లూరు జిల్లా నుండే కాకుండా, ఇతర ప్రాంతాల నుండి కూడా సందర్శకులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంచలకోన జలపాతం జోరుగా పరవళ్లు తొక్కుతుంది. ఆలయ సమీపంలో ఉన్న కణ్వ నది వానల ధాటికి ఉధృతంగా ప్రవహిస్తోంది. పెంచలకోన ఆలయం చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఇక్కడ దశాబ్దాల క్రితం కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నెల్లూరు నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంచలకోనలో ఆధ్యాత్మికతను, ఆహ్లాదకర దృశ్యాలను ఆస్వాదిస్తూ, గోవింద నామస్మరణతో పర్యాటకులు తన్మయం చెందుతున్నారు. జలపాతపు సోయగాలను చరవాణిలో హృద్యంగా బంధిస్తున్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560

పొంగిన వాగులు - స్తంభించిన రాకపోకలు

కొండాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం వర్షం ఆగినప్పటికీ నీటి ప్రవాహం తగ్గలేదు. కొండాపురం-రేణమాల మధ్యలో ఉన్న ఉప్పుటేరు బ్రిడ్జి పై నుంచి నీరుపారడంతో పోలీసులు వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. సత్యవోలు - అగ్రహారం మధ్యలో ఉన్న మిడతవాగు, కొమ్మి గ్రామం వద్ద గండికట్ల చెరువు అలుగు పారడంతో రోడ్లపైకి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో ఆదినారాయణ, ఎస్ఐ మాల్యాద్రి వాహనదారులు వెళ్లకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.


ఉధృతంగా పారుతున్న గండికట్ల చెరువు అలుగు

రూ.30 లక్షల వెచ్చించినా...
తప్పని వరద ముప్పు!

- జలదిగ్బంధంలో అన్నపుగుంట ప్రాంత వాసులు
- ఫలించని అధికారుల ముందు జాగ్రత్త చర్యలు
- రైల్వే ట్రాక్ వెంబడి కాలువ నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం

కావలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి.. అన్నట్లుగా తయారైంది పట్టణంలోని వైకుంఠపురం అన్నపుగుంట ప్రాంత వాసుల పరిస్థితి. ఈ ప్రాంతానికి వరద ముప్పు తప్పించేందుకు మున్సిపాల్టీ రూ.30 లక్షల ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినా వరద ముప్పు తప్పలేదు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు అన్నపుగుంట లోతట్టు ప్రాంతమంతా జలమయమైంది. ఆ ప్రాంతం ముంపునకు గురికాకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు తమ సిబ్బంది ద్వారా ఎప్పటి కప్పుడు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినా వరద ముంచెత్తింది. అర్ధరాత్రి వరకు ఎలాంటి వర్షం లేకుండా ప్రశాంతంగా ఉండడంతో ఆ ప్రాంత వాసులు తమ ద్విచక్ర వాహనాలను సైతం ఇంటి ముందు రోడ్లపైనే ఉంచారు. అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఆ ప్రాంతమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. వీధుల్లో నడుము లోతు నీరు చేరడంతో ఇళ్లు మునకనకు గురయ్యాయి. దీంతో పాటు ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు నీట మునిగి స్టార్ట్ కాకుండా మొరాయించాయి. జనతాపేట పై ప్రాంతంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీటి నంతటిని అన్నపుగుంటకు మళ్లించడంతో ఇన్‌ఫ్లోకు తగ్గట్లు అవుట్ ఫ్లో లేక ఆ ప్రాంతం మునకకు గురైంది. ఓ పక్క మున్సిపల్ అధికారులు కార్మికులతో నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు. అయి తే రైల్వే లేను మార్గంలో నీరు వెళ్లేందుకు ఉన్న తూముకు అడ్డంగా ముళ్ల చెట్లు, చెత్తా చెదారం చేరడంతో అక్కడ నీరు ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలో అన్నపుగుంట నుంచి ఉత్తరం వైపున రైల్వే ట్రాక్ వెంబడి పెద్ద కాంక్రీట్ కాలువ నిర్మిస్తే తప్ప ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదని స్థానికులు అంటున్నారు.


అన్నపుగుంట ప్రధాన రోడ్డులో ద్విచక్ర వాహన చోదకుల అవస్థ


అన్నపుగుంట పక్క వీధిలో ఇళ్లను చుట్టుముట్టిన వర్షపు నీరు


నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టిన అధికారులు

కావలి డివిజన్‌లో వర్షపాత వివరాలు

కావలి డివిజన్‌లో గురువారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్ర వారం ఉదయం వరకు డివిజన్‌లో సరాసరి 78.1 మి.మీ వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో అత్యధికంగా అల్లూ రులో 117.6మి.మీ కురవగా అత్యల్పంగా జలదంకిలో 40.2 మి.మీ వర్షం కురిసింది. దుత్తలూరులో 70.2, వింజమూరులో 82.4, కలిగిరిలో 116.8, కావలి 85.2, బోగోలులో 79.8, దగదర్తిలో 48.6, కొడవలూరులో 73.2, విడవలూరులో 67.4 మి.మీ వర్షపాతం సమోదైంది.

బాధితులకు ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారకానిపాడులో కారుతో గుద్దించిన ఘటనలో గాయపడిన పవన్, భార్గవ్‌లను, వారి కుటుంబ సభ్యులను శుక్రవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. వారు చికిత్స పొందుతున్న గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి పరామర్శించిన ఎంపీ వేమిరెడ్డి వారికి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడుతూ ఈ దుర్ఘటన చాలా బాధాకరమని, వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు గ్రామీణ రహదారుల ఛిద్రం

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కందుకూరు ప్రాంతంలోని రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల రహదారులు పూర్తిగా దెబ్బతిని అడుగుకో గుంత ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న గ్రావెల్ రోడ్లు, పొలాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని మోటారు సైకిళ్లపై కూడా ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. కందుకూరు నుంచి శింగమనేనిపల్లి వెళ్లే రహదారి కేపీఎస్ఎం రోడ్డు నుంచి శింగమనేనిపల్లి వరకు పూర్తిగా దెబ్బతినగా, పోకూరు-చీమలపెంట రోడ్డు కూడా గతుకు లమయంగా మారింది. కందుకూరు నుంచి చుట్టుగుంట వెళ్లేమార్గంలో మూడుచోట్ల లోలెవల్ చప్టాలపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలోని మన్నేటికోట, ఆత్మకూరు, చుట్టుగుంట, కుమ్మరి పాలెం, కంద్రావారిపాలెం గ్రామాలతో పాటు ఉలవపాడు నుంచి కందు కూరుకు వచ్చేవారు చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కందు కూరు నుంచి ఆదిఆంధ్రకాలనీ, దివివారిపాలెం, గనిగుంట గ్రామాలకు వెళ్లే రోడ్డులో కూడా ఆదిఆంధ్రకాలనీ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి ఎంతో కాలంగా అసంపూర్తిగా ఉండగా ఇక్కడ నిర్మించిన డైవర్షన్ రోడ్డు పైపులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. కందుకూరు-మాచవరం, ఆనందపురం, దొండపాడురోడ్డు దెబ్బతిని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


కందుకూరు మున్సిపాలిటీలోని ఆదిఆంధ్రకాలనీ రోడ్డులో పైపు కల్వర్టుకు ఏర్పడిన రంధ్రం

వర్షాలొస్తే వణుకే!

జలదంకి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో మండలంలో ప్రజలు, వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. జలదంకి-తెల్లపాడు రహదారిపై గోపన్నపాలెం వద్ద చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనరాకపోకలు నిలిచిపోవడంతో కావలి పట్టణం, మండలకేంద్రం జలదంకి వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు గోపన్నపాలెం, అన్నవరం, గట్టుపల్లి, తిమ్మసముద్రం తదితర గ్రామాల ప్రజలు. విద్యార్థులు ఒకరి చేయి ఒకరు పట్టుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మండలంలోని బ్రాహ్మణక్రాక నుంచి బోగోలు మండలంలోని కప్పరాళ్లతిప్ప వద్ద ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిని కలిపే ఈ ఆర్ అండ్‌బి రోడ్డుపై చామదల వద్ద ఉన్న చప్టాపై నేరెళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే కమ్మవారిపాలెం వాగు చప్టాపై ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలు స్తంభిస్తున్నాయి. సాధారణంగా పల్లెప్రజలు కోరుకునేది భారీవర్షాలు కురిసి ఊళ్లో చెరువు నిండాలి, జిల్లాలోని జలాశయాలు నిండాలి, వాగులు, వంకలు, కుంటలు జలకళతో ఉట్టిపడాలి అని కోరుకోవడం సహజం. ఎందుకంటే వర్షాలు పడితే పంటలు పండుతాయని, పాడిపశువులకు బీళ్లలో మేతదొరుకుతుందని ఆశ. కానీ ఇదే గ్రామీణుల్లో కొన్ని గ్రామాల ప్రజలు వాతావరణంలో మార్పులు వచ్చి భారీ వర్షసూచన వాతావరణశాఖ ప్రకటిస్తే వీరి వెన్నులో వణుకే. ఎందుకంటే భారీవర్షాలు వస్తే ఊరిని ఆనుకుని ఉండే వాగులు ఉధృతంగా ప్రవహించి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి, ఎప్పుడు ఏ ఆరోగ్య సమస్య వచ్చి సమీపంలోని పట్టణంలో ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వెళ్లలేమోననే భయంతో పాటు నిత్యావసర సరుకులు రోజుల తరబడి దొరకని పరిస్థితి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


కమ్మవారిపాలెం రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ప్రమాదకరంగా రామన్న చెరువు

అల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామన్న చెరువు నీటిమట్టం అధికమై రోడ్డుపైకి నీరు పారుతుండడంతో ప్రమాదాలు జరుగకుండా అల్లూరు కావలి రోడ్డుపై రాకపోకలను నిలిపివేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్ర వారం రోడ్డుపై కంపను వేయించి రోడ్డును మూయించి వేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు కౌరుగుంట మీదుగా వెళ్లాలని ఈ రోడ్డుపై రాకపోకలు జరపకూడదని పేర్కొన్నారు. రామన్న చెరువు నీటిమట్టం తగ్గేంతవరకు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభు, ఏఈ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.


కాలనీలోకి చేరిన వర్షపు నీరు, రహదారికి అడ్డంగా కంప వేయిస్తున్న తహసీల్దారు

- పట్టణ పరిధిలోని కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీకాలనీ, రజకకాలనీ, బీసీ కాలనీల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. మహిళలు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొనగా స్థానిక నాయకుడు నజీర్‌బాషా చొరవతో సమాచారం అందుకున్న నరగ పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు పూడిపోయిన కాలువలను ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగించి నీటిని తొలగింప చేయించారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం


విద్యార్థులకు నగదు అందజేస్తున్న జడ రజని

లింగసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన దేపూరి కిషోర్‌కు రూ.5000, ఏసుపోగు శృతికి రూ.5000 చొప్పున అదే హైస్కూల్ పూర్వపు విద్యార్థి, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ మండలంలోని తిమ్మారెడ్డిపాలెంకు చెందిన జడ శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రజనీ శుక్రవారం నగదు పురస్కారాలు అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మెన్ డీ.రవి, మాజీ సర్పంచు ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.కొండయ్య, కే.వెంకటేశ్వర్లు, కే.ప్రభాకర్, శ్రీనివాసులు బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి మహానగరానికి శుక్రవారం తొలి అడుగు పడింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ ప్రతిపాదనకు సభ్యులు ఏకగ్రీవంగా జైకొట్టారు. కౌన్సిల్ ఆమోదించిన తీర్మాన ప్రతులను, విలీన ప్రతిపాదనలను కలెక్టర్ శుక్రవారమే సంబంధిత పంచాయతీల కార్యదర్శులకు పంపించారు. ఆయా పంచాయతీల నుంచీ విలీన తీర్మానాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. ఏది ఏమైనా డిసెంబరు నెలాఖరులోపు గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. మొత్తమ్మీద ఈ ఏడాది ప్రారంభంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చేపట్టిన కసరత్తు ఇప్పటికి ఓ కొలిక్కి వచ్చింది.

సీఎం చొరవతో ముందడుగు

సంస్కరణలకు, దార్శనికతకు పేరుపడిన సీఎం చంద్రబాబు తిరుపతి నగర అభివృద్ధిపై తొలి నుంచీ శ్రద్ధాసక్తులు చూపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రారంభంలో నారావారిపల్లికి వచ్చిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌కు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అందులో గ్రేటర్ తిరుపతి ఒకటి. అప్పట్నుంచి జిల్లా యంత్రాంగం దీనిపై కసరత్తు ప్రారంభించింది. భౌగోళికంగా ప్రజలకు గానీ, అధికార యంత్రాంగానికి గానీ అసౌకర్యం కలగని రీతిలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని 53 పంచాయతీలకు సంబంధించిన 63 రెవెన్యూ గ్రామాలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- సీఎం ఆదేశాలతో గ్రేటర్ ప్రతిపాదన
- కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానంతో తొలి అడుగు
- ఆయా పంచాయతీలకు తీర్మాన ప్రతులు పంపిన కలెక్టర్
- వాటి నుంచీ తీర్మానాలు రాగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- డిసెంబరు ఆఖరులోగా నోటిఫికేషన్ జారీకి ప్రయత్నాలు
- సీఎం ఆదేశాలతో ఫలిస్తున్న జిల్లా యంత్రాంగం కసరత్తు

తిరుపతి మహానగరం..!



ఎస్వీయూ సెనేట్ హాల్లో కౌన్సిల్ సమావేశానికి హాజరైన మేయర్, కార్పొరేటర్లు

అనూహ్యంగా మారనున్న తిరుపతి రూపురేఖలు

గ్రేటర్‌గా మారితే తిరుపతి నగర రూపురేఖలు అనూహ్యంగా మారిపోనున్నాయి. ఇపుడు కేవలం 30 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన తిరుపతి.. 284 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. 4.50 లక్షల జనాభా 7.50 లక్షలకు పెరగనుంది. రూ.149 కోట్లుగా ఉన్న వార్షికాదాయం రూ.182 కోట్లకు చేరనుంది. చంద్రగిరి, రేణిగుంట వంటి మేజర్ పంచాయతీ కేంద్రాలు తిరుపతిలో అంతర్భాగం కావడంతో పాటు విమానాశ్రయం వెలుపలున్న వికృతమాల దాకా నగరం విస్తరించనుంది.

చంద్రగిరి పంచాయతీలతో అభ్యంతరాలు

చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాలకు చెందిన పంచాయతీలు తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం కావడం పట్ల ఎమ్మెల్యే పులివర్తి నానీకి అభ్యంతరమేమీ లేదని సమాచారం. తిరుపతి అభివృద్ధి పట్ల ఆయనకూ ఆసక్తి ఉందని సన్నిహితులు చెబుతున్నారు. అయితే రాజకీయ కోణం నుంచి చూసినప్పుడు పంచాయతీల విలీనం కారణంగా ఆయనపై స్థానిక నేతల నుంచీ తీవ్ర ఒత్తిడి ఎదురు కానుంది. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్పంచు పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు తాజాగా గ్రేటర్ ప్రతిపాదనలు రావడంతో నిస్పృహ చెందుతున్నట్టు చెబుతున్నారు. ఈ కారణంగానే చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీల విలీనం పట్ల ఎమ్మెల్యే నానీ కొంత అయిష్టంగా ఉన్నట్లు సమాచారం. అయితే సీఎం చంద్రబాబు ఆసక్తి, ఆదేశాల నేపథ్యంలో ఆయన పార్టీ నేతలను సమాధానపరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



క్రెడిట్ కొట్టేసేందుకు వైసీపీ నేతల విఫలయత్నం

కాగా గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదనలపై సీఎం ఆదేశాలను, జిల్లా యంత్రాంగం కసరత్తును పక్కన పెట్టి తాము క్రెడిట్ కొట్టేసేందుకు వైసీపీ నేతలు విఫలయత్నం చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు వైసీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్ మేరకు తీర్మానం పెడుతున్నట్టుగా కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారని కూటమి సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వమే ఉండగా, తిరుపతి కౌన్సిల్ సైతం వారి చేతుల్లోనే ఉన్నప్పటికీ గ్రేటర్ ప్రతిపాదన ఎందుకు చేయలేదని వారు ప్రశ్నిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశించాక తొమ్మిది నెలల పాటు జిల్లా యంత్రాంగం చేసిన కసరత్తుతోనే ఇపుడు కౌన్సిల్ సమావేశంలో విలీన ప్రతిపాదన అజెండాలోకి వచ్చిందని చెబుతున్నారు. అవేమీ పట్టించుకోకుండా వైసీపీ నేతలు క్రెడిట్ కొట్టేసేందుకు విఫల యత్నం చేయడం చర్చకు దారి తీసింది.




ఈతకు వెళ్లిన నలుగురి గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. ఆచూకీ లభించని మరో ముగ్గురు
- చీకటి, వర్షంతో గాలింపు బృందాలు వెనక్కి
- వేదాంతపురంలో విషాదం

ఒకరి పుట్టిన రోజు. సరదాగా ఈతకని వెళ్లారు. ఆ తర్వాత వచ్చి కేకు కట్ చేద్దామని ప్లాన్ చేసుకున్నారు. స్వర్ణముఖి నదిలోని ఇసుక దిబ్బపై ఆడుతూ.. నీళ్లలో దూకుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఆ సమయంలో పెరిగిన నీటి ప్రవాహంతో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు చనిపోయారు. మిగతా ముగ్గురి ఆచూకీ దొరకలేదు. ఈ విషాదం తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది.



గాలిస్తున్న సిబ్బంది



సంఘటన స్థలం వద్ద ఎమ్మెల్యే నాని తదితరులు

తిరుపతిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం అగ్రహారానికి చెందిన మంజుల, మునస్వామిరెడ్డి దంపతులకు బాలు, తేజు కుమారులు. చిన్నకుమారుడు బాలు పుట్టినరోజు కావడంతో శుక్రవారం పాఠశాలకు వెళ్లలేదు. మరో ఐదుగురు స్నేహితులతో కలసి సరదాగా ఈతకని స్వర్ణముఖి నదిలోకి వెళ్లారు. సాయంత్రం 4.30గంటలకి నదిలోని ఇసుకదిబ్బలపై ఆడుతూ స్నానం చేస్తున్న సమయంలో అకస్మాతుగా పెరిగిన నీటిప్రవాహానికి ప్రకాశ్(17), మునిచంద్ర అలియాస్ చిన్న(15), తేజు(19), బాలు(16) కొట్టుకుపోగా.. కృష్ణ, విష్ణు, మునికృష్ణ బయటపడ్డారు. ఈ ముగ్గురిలో ఒకరు నదిమధ్యలో చెట్టును పట్టుకుని వేలాడుతుండగా, అటువైపు వచ్చిన యువకుడు ఒడ్డుకు చేర్చారని, మిగిలిన ఇద్దరు ఇసుకదిబ్బపై నిలబడి ఉన్నారని తెలిసింది. గల్లంతైన ముగురు బాలురకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈతకు వెళ్లిన బాలురుల్లో ఒకరు 100కి డయల్ చేయడంతో రక్షణ సిబ్బంది, గాలింపుబృందాలు నదిలోకి దిగి చర్యలు చేపట్టగా బాలు మృతదేహం బయటపడింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానీ ఘటనా స్థలానికి చేరుకుని ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవిమనోహరాచారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్థానికుల ద్వారా పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఇన్‌చార్జి మంత్రికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చామని, సీఎం ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారని నాని తెలిపారు. వైసీపీప్రభుత్వంలో స్వర్ణముఖినదిలో ఎక్కడపడితే అక్కడ ఇసుకతవ్వకాలు చేపట్టడంతో భారీగుంతలు ఏర్పడ్డాయని, నదిలో ఇసుకరవాణాకు దారి లేకుండా అన్ని దారులు మూసేసేలా చర్యలు చేపడతామన్నారు. తిరుపతిరూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్, రూరల్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు. ఒకవైపు చీకటి పడటం, వర్షం కురుస్తుండటంతో గాలింపు బృందాలు వెనక్కి వచ్చాయి. మరోపక్క పోలీసులు డ్రోన్ ద్వారా పర్యవేక్షించారు. కాగా, బాపట్ల నుంచి రెస్క్యూ టీమ్ ఇక్కడికి వచ్చింది. శనివారం వేకువన 5 గంటల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, వీరిలో ఇద్దరు ఎమ్మార్‌పల్లె జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి.. మరో ఇద్దరు ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. ఈఘటనపై జిల్లా కలెక్టర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థులకోసం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలియజేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. సహాయక చర్యలనుచేపట్టాలని అధికారులను ఆదేశించారు.నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

తమ్ముడిని కాపాడబోయి అన్న గల్లంతు

తేజు, బాలు అన్నదమ్ములు. తేజు సాయంత్రం 4.20గంటల సమయంలో స్వర్ణముఖి సమీపంలో జీవాలను తోలుకొచ్చి మేపుతూ స్థానికులతో మాట్లాడారని అంటున్నారు. నదిలో పెద్దగా కేకలు వినబడడంతో అటువైపుగా వెళ్లి తమ్ముడు బాలును రక్షించబోయి గల్లంతయ్యాడని భావిస్తున్నారు. పెద్దకుమారుడు గల్లంతవడం.. చిన్న కుమారుడు పుట్టినరోజే చనిపోవడంతో మంజుల దంపతులు బోరున విలపించారు. వీరిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

చల్లకాలువలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి సమీపంలోని చల్లకాలువ నదిలో శుక్రవారం గల్లంతైన మాణికల పోలయ్య(68) మృతదేహం లభ్యమైంది. కర్లపూడిలోని మేకలతోక గిరిజనకాలనీకి చెందిన పోలయ్య, స్నేహితుడితో కలిసి రెండు రోజుల క్రితం చేపలు పట్టేందుకు సమీపంలోని చల్లకాలువ నదిలోకి వెళ్లారు. పోలయ్య చేపలు పట్టేందుకు వల విసురుతూ ప్రమాదవశాత్తు నదిలో పడి వరదనీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్‌ఐ పవన్‌కుమార్, అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలయ్య కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం గోవిందపల్లిపాళెం గ్రామానికి చెందిన మత్స్యకారులైన గజ ఈతగాళ్లను పిలిపించి పొద్దుపోయే వరకు చల్లకాలువలో గాలించినప్పటికీ పోలయ్య జాడ తెలియలేదు. శుక్రవారం ఉదయం చల్లకాలువ నదిలోని కర్రతుమ్మ చెట్ల మధ్య గల్లంతైన పోలయ్య మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



నదిలో తేలి ఉన్న పోలయ్య మృతదేహాన్ని బయటకుతీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

కాళంగిలో బయటపడ్డ గిరిజనుడి మృతదేహం

దొరవారిసత్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తనియాలి ఆనకట్ట వద్ద కాళంగి నదిలో గురువారం కొట్టుకుపోయిన మేకల పోలయ్య(31) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. చేపల వేటకు వెళ్లి ఆనకట్ట పైనుంచి జారి నదిలో పడిపోయిన పోలయ్య వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. శుక్రవారం ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు నదిలో గాలించగా కమ్మకండ్రిగ గట్టు వద్ద పోలయ్య మృతదేహం నీటిపై తేలాడుతుండడాన్ని గుర్తించారు. పడవ సాయంతో మృతదేహాన్ని గట్టుకు తీసుకువచ్చి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.



నదిలో నుంచి పోలయ్య మృతదేహం తీసుకొస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు

స్వామి భక్తితో విధులు మరిచిన

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

- తుపాకీ వదిలేసి భూమన వెంట ఆలయంలోకి వెళ్లిన మాజీ గన్‌మ్యాన్

తిరుపతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వామి భక్తి ప్రదర్శించే క్రమంలో అసలు విధి మరచిపోయిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురైనవైనమిది. శ్రీవారి ఆలయ భద్రతా విధుల్లో ఉంటూ తుపాకీ వదిలేసి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెంట ఆలయంలోకి వెళ్లిన మాజీ గన్‌మ్యాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్వాపరాలిలా వున్నాయి. కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన చెన్నారెడ్డి తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్ (నంబరు 1890)గా పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూమన కరుణాకర్‌రెడ్డికి గన్‌మెన్‌గా పనిచేశారు. ఎన్నికల తర్వాత రిలీవైన ఆయన తిరుమల శ్రీవారి ఆలయం వద్ద భద్రతా విధుల్లో ఉన్నారు. ఈనెల 6వ తేదీన శ్రీవారి దర్శనం కోసం భూమన తిరుమల వెళ్లారు. గొల్ల మండపం వద్ద బందోబస్తు డ్యూటీలో ఉన్న చెన్నారెడ్డి కరుణాకర్‌రెడ్డిని చూడగానే చేతిలోని తుపాకీని అక్కడే వదిలేసి ఆయన వెంట ఆలయంలోకి వెళ్లారు. శ్రీవారిని దర్శించుకుని వెనుదిరిగి వెళ్ళే వరకూ భూమన వెంటే ఉన్నారు. అక్కడి అధికారులు ఈ విషయాన్ని ఎస్పీ సుబ్బరాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 6వ తేది ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ చెన్నారెడ్డి గొల్లమండపం వద్ద విధుల్లో లేరని, తుపాకీ అక్కడే వదలిపెట్టేసి వెళ్లారని విచారణలో తేలింది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఏఆర్ కానిస్టేబుల్ చెన్నారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. మూడు గంటల పాటు తుపాకీని వదిలిపెట్టేసి వెళ్ళిపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు చెన్నారెడ్డిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పల్లె వెలుగు బస్సులో పొగలు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో పొగలు వచ్చిన ఘటన నాయుడుపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ప్రయాణికుల కథనం మేరకు... వాకాడు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు శుక్రవారం ఉదయం కోట నుంచి నాయుడుపేటకు ప్రయాణికులతో బయలుదేరింది. నాయుడుపేట పట్టణ శివారులోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలోకి రాగానే బస్సు వెనుక టైర్ల బ్రేక్ డ్రమ్‌లో నుంచి పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపేసి ప్రయాణికులను దింపేసి డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. సుమారు అర్ధగంట తరువాత పొగలు రావడం ఆగిపోవడంతో బస్సును నాయుడుపేట బస్టాండ్ ప్రాంగణానికి తరలించారు.

మరో ఐదు రోజులూ భారీ వర్షాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని శుక్రవారం ఆదేశించారు. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రాబోయే మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని ఆయన సూచించారు ప్రజలు ఎలాంటి ప్రమాద స్థితిలోనైనా 0877-2236007లో సంప్రదించవచ్చన్నారు.

వర్షపాతం ఇలా: శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు.. అత్యధికంగా కేవీబీపురం 83 మి.మీ. వాన పడింది. ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ 71.8, పెళ్లకూరు 66.6, సూళ్లూరుపేట 64.8, ఎర్రావారిపాళెం 60.8, వడమాలపేట 55.8, రేణిగుంట 55.6, వరదయ్యపాళెం 51.4, పిచ్చాటూరు 50.6, నాగలాపురం 45.4, నారాయణవనం 41.8, సత్యవేడు 38.2, చంద్రగిరి 34.8, చిన్నగొట్టిగల్లు 34.4, తిరుపతి అర్బన్ 32.2, తడ 30.4, శ్రీకాళహస్తి 29.8, నాయుడుపేట 29.4, దొరవారిసత్రం 28.6మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో సెలవుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.


జస్టిస్ సునీల్ చౌదరి


రఘురామకృష్ణమరాజు


సావిత్ర ఠాకూర్


విజయభారతి సాయని


అరవింద్ సింగ్


జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



మనోజ్ శశిధర్


అశ్విని

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, కేంద్ర మహిళా శిశు శాఖ మంత్రి సావిత్ర ఠాకూర్, కేంద్ర జల శక్తి డైరెక్టర్ హరి నారాయణన్,జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని,గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ రామ్మోహన్,ఇండియన్ ఆయిల్ చైర్మన్ అరవింద్ సింగ్, సీబీఐ డైరెక్టర్ మనోజ్ శశిధర్, తెలంగాణ లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, నటి అశ్విని ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిది షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.33 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 60,896

తలనీలాలు సమర్పించినవారు: 23,077


పట్టుబడిన నాగుపాము

అమ్మో.. 9 అడుగుల నాగుపాము

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలిబాటలోని ఎస్ఎస్ టెంపుల్ వద్ద సుమారు తొమ్మిది అడుగుల పొడవైన నాగుపాము శుక్రవారం ఓ దుకాణంలోకి ప్రవేశించింది. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 24 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 24 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 2.40 లక్షల రూపయాలను జరిమానాగా విధించారు.

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాదాయం రూ. 50వేల కోట్లు

● తిరుపతి కేంద్రంగా భారీ అవినీతి ● ప్రజలు చైతన్యం కావాలి ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు పిలుపు

తిరుపతి(విద్య/ఆటోనగర్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కేంద్రంగా ఏపీ ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి జరుగుతోంది. ఏటా ఇక్కడి అక్రమాదాయం రూ.50 వేల కోట్లు' అని ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ రంగంలో అవినీతిపై సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమలోని 11 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు రూ.1200 కోట్లతో అల్లైడ్ ఎక్విప్‌మెంట్ డబ్బు చెల్లించారు. ఎక్కడా ఒక మీటరు కూడా అమర్చలేదు. ఇతర రాష్ట్రాల్లో మీటరుకు రూ.6-7 వేలు చెల్లిస్తే, మన రాష్ట్రంలో రూ.33 వేల వంతున ఇచ్చారు. ఇక, ఆర్‌డీఎస్ఎస్ కింద 26 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఆర్డరు చేస్తే సరఫరా అయింది ఆరు వేలే. మిగిలిన 20 వేల ట్రాన్స్‌ఫార్మర్లు రెండున్నరేళ్లుగా షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ గోడౌన్లలోనే ఉన్నట్టు రికార్డులు చూపిస్తున్నాయి. 2018 టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ పరికరాల కొనుగోలుకు జరిగిన టెండర్-65 ద్వారా 7 కంపెనీలు అర్హత సాధించాయి.వాటిలో తోషిబా,షిరిడీసాయి ప్రధానంగా ఉన్నాయి. 2023లో వైసీపీ ప్రభుత్వంలో టెండర్-34 ద్వారా 8 కంపెనీలు బిడ్లు వేస్తే కేవలం షిరిడీసాయి, తోషిబా మాత్రమే అర్హత సాధించడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోకూడా ఈరెండు కంపెనీలకే కాంట్రాక్టులు ఇస్తున్నారు. అందులోనూ షిరిడీసాయి కంపెనీకే 80-95 శాతం ఉంది. జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దోపిడీని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. విద్యుత్ మాఫియాను అడ్డుకునే శక్తి ఈ ప్రభుత్వానికి ఉందా లేదా? ఇలా రూ.వేల కోట్ల అవినీతితో బిల్లుల పేరిట ప్రజల నడ్డి విరుస్తున్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించాలని, పోరాడాలి' అని ఏబీవీ పిలుపునిచ్చారు. అంతకుముందు సెంటర్ ఫర్ లిబర్టీ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తి ఇదే విషయాలను వాటికి సంబంధించిన రికార్డులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యుత్ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడేందుకు ఎలా ముందుకు వెళ్లాలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యుత్తు సంస్థల్లో అవినీతి నిగ్గు తేల్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండు చేశారు. ఇది లిక్కర్ స్కాం కంటే పెద్దదని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందారపు మురళి పేర్కొన్నారు. ఈ అవినీతిపై ప్రజాక్షేత్రంలో చర్చ జరగాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ సూచించారు. అవినీతికి బలవుతున్నది దళితులు, బహుజనులేనని ఆర్పీఐ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. చార్జీలపెంపు, అవినీతిపై అవగాహన పెరగాలని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేత కె.మోహన్ కుమార్ రాజు అన్నారు. ఈ తరహా అవినీతిని అరికట్టడానికి ప్రజా ఉద్యమం రావాలని బహుజన సమాజ్‌వాది పార్టీ నేత పేరం సత్యం అభిప్రాయపడ్డారు. విద్యుత్ సంస్థలో అవినీతిపై లోతుగా విచారణ జరగాలని విశ్రాంత ఎస్ఈ దేవేంద్రరెడ్డి అన్నారు. పాలకుల వల్లే అవినీతి పెరుగుతోందని లోక్‌సత్తా పార్టీ నేత రామారావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలతో పాటు లిబర్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అక్కినేని భవానీప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏబీ వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధులు, నేతలు

చర్చంతా 'గ్రేటర్ తిరుపతి'పైనే

● సీఎం చంద్రబాబు గొప్ప ఆలోచనతో ప్రతిపాదన చేశారన్న ఆరణి ● ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో శుక్రవారం తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన చర్చంతా గ్రేటర్ తిరుపతి పైనే జరిగింది. మొత్తం 108 అంశాలను కౌన్సిల్‌లో అజెండాగా ఉంచినట్టు మేయర్ శిరీష ప్రకటించారు. ఇందులో 100వ అంశంగా గ్రేటర్ తిరుపతి తీర్మానం ఉన్నట్టు తెలిపారు. గ్రేటర్ తిరుపతి తీర్మానాన్ని ఒకటిగా ప్రవేశపెట్టాలని కార్పొరేటర్లు పట్టుబట్టారు. కాగా, ప్రస్తుతం యథాతదంగా తిరుపతి ఉంటే ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా ఉన్నాయని మేయర్ శిరీష అన్నారు. టీటీడీ సత్రాలు, బస్టాండు, రైల్వే స్టేషన్ అన్నీ ఒకే చోట ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్లు విస్తరించాలంటే కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మెట్రో పాలిటన్ సిటీగా తిరుపతి మారితే అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు గొప్ప ఆలోచనతో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన చేశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గ్రేటర్ తిరుపతి ఏర్పాటులో భాగంగా సమీప నియోజకవర్గాలు, మండల, గ్రామ పంచాయతీలకు సంబంధించి కొన్ని రోజులు చర్చించి నిర్ణయం తీసుకుందామని కోరారు. తనతో పాటు గ్రేటర్ తిరుపతి ఏర్పాటు పట్ల ఎవరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గ్రేటర్ తిరుపతిలో భాగంగా నగర విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ గురుమూర్తి కోరారు. తిరుపతికి అధిక నిధులు రాబట్టేందుకు ప్రయత్నం జరగాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ తిరుపతి ఆలోచన చేయలేదని, ప్రస్తుతం ఈ దిశగా ఆలోచించిన సీఎం చంద్రబాబుకు కౌన్సిల్ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చెప్పారు. కాగా, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మిగతా 107 ప్రతిపాదనలపై చర్చించకుండానే ఆమోదించారు. తుడా వీసీగా, జేసీగా అదనపు బాధ్యతలు స్వీకరించినందుకు కమిషనరు మౌర్యను కౌన్సిల్ అభినందించింది. సమావేశానికి ముందు కార్పొరేటర్ అన్నా సంధ్యా భర్త, కుమారై మృతి పట్ల కౌన్సిల్ సంతాపాన్ని వ్యక్తం చేసింది.


తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ మీట్‌లో కార్పొరేటర్ గణేష్‌ను నెట్టివేసిన ఎస్‌కే బాబు అనుచరుడు

ఘటనపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఘటనపై కార్పొరేటర్ ఎస్‌కేబాబు అన్న కుమారుడు మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ అధికారి సేతుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కౌన్సిల్ మీట్‌లో ఘర్షణ

గ్రేటర్ తిరుపతి తీర్మానంపై చర్చ సాగుతున్న సమయంలో ఇద్దరు కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. జనసేన కార్పొరేటర్ ఎస్‌కే బాబు చర్చలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న సమయంలో.. వైసీపీ కార్పొరేటర్ గణేష్ జోక్యం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన తీసుకురాలేదనీ, మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎస్‌కే బాబు స్పష్టంచేశారు. గ్రేటర్ తిరుపతి జరిగితే భూ వ్యాపారం చేద్దామనా అంటూ ఆయన్ను గణేష్ హేళనగా మాట్లాడారు. దీంతో ఎస్‌కే బాబు కోపోద్రిక్తులయ్యారు. ఇదే సమయంలో వైసీపీ కార్పొరేటర్ గణేష్ ఆవేశంగా మాట్లాడటంతో, ఎస్కే బాబు సోదరుడి కుమారుడు రంగ ప్రవేశం చేసి గణేష్‌పై చేయి చేసుకున్నారు.కూటమి కార్పొరేటర్లు అతడిని దండించి వెలుపలకు పంపారు.తనకు న్యాయం చేయాలంటూ గణేష్ అక్కడే బైఠాయించారు. దీంతో ఎస్‌కే ఆయనకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంలో క్రిమినల్ చర్యలకు తాను, తన అనుచరుడు సిద్ధమని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'స్కిట్' తరగతులపై గందరగోళం

● కలికిరి కళాశాలకు విద్యార్థులను పంపాలంటూ జేఎన్‌టీయూ నిర్ణయం

● పిల్లల భవిష్యత్తుతో చెలగాటం తగదంటూ తల్లిదండ్రుల నిరసన


స్కిట్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల ఆరంభంపై మళ్లీ గందరగోళ పరిస్థితి నెలకొంది. అడ్మిషన్లు తక్కువగా ఉండటంతో తొలి ఏడాది విద్యార్థులకు కలికిరిలో తరగతులు నిర్వహిస్తామని జేఎన్‌టీయూ నిర్వాహకులు ప్రకటించడంపై వ్యతిరేకత వ్యక్తమైంది. శ్రీకాళహస్తిలో అడ్మిషన్ తీసుకున్న తమ పిల్లలను రెండు నెలలు ఆలస్యంగా ఇతర ప్రాంతానికి తరలించాలని సూచించడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కళాశాల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరం స్కిట్ పునఃప్రారంభమయ్యాక 43 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాలను ముక్కంటి ఆలయం నుంచి జేఎన్‌టీయూకు అధికారికంగా లీజు ప్రాతిపదికన అప్పగింతకు జీవో మూడు రోజుల క్రితం వెలువడింది. తొలి ఏడాది విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో కలికిరి కళాశాలలో తరగతులు నిర్వహించేలా చూస్తామని శుక్రవారం జేఎన్‌టీయూ ప్రతినిధి వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ సమయంలో ఎన్నో కళాశాలల్లో అవకాశాలు ఉన్నప్పటికీ స్థానికంగా తమ పిల్లలను చదివించుకోవచ్చన్న ఉద్దేశంతో అడ్మిషన్లు పొందామన్నారు. ఇపుడు సమీపంలో ఎక్కడా అవకాశం లభించదని ఆవేదన వ్యక్తం చేశారు.హోంసిక్‌తో బాధపడే పిల్లలు కలికిరికి ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. రెండు నెలలు ఆలస్యం కావడంతో ఇప్పటికే తొలి ఏడాది విద్యలో వెనుకబడ్డారని వాపోయారు. శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహించేలా మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే సుధీర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● శ్రీసిటీలో నిట్టన్ ఇండియా

అదనపు ఉత్పత్తి కేంద్రం ప్రారంభం


ఉత్పత్తులు ప్రారంభిస్తున్న నిట్టన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ లీ తైహ్వాన్

సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన నిట్టన్ వాల్వ్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ నిట్టన్ ఇండియా టెక్ (ఎన్ఐటీ) పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. హ్యుందాయ్, హోండా, టయోటా, అశోక్ లేలాండ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా, హెచ్ఎంఎస్ఐ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలకు ఇంజిన్ వాల్వ్‌లు సరఫరా చేస్తున్న నిట్టన్ ఇండియా ఈ అదనపు ప్లాంట్ నిర్మాణంతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12 మిలియన్ల నుంచి 24 మిలియన్లకు పెంచింది. ఈ సందర్భంగా నిట్టన్ ఇండియా టెక్ ఎండీ యంగ్ ఓకో మాట్లాడుతూ... 2018 అక్టోబరులో ప్రారంభమైన తమ ప్రయాణాన్ని, లక్ష్యాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సుందర్ మాట్లాడుతూ... నిట్టన్ నాణ్యమైన ఉత్పత్తులు తమ సంస్థ విజయంలో కీలక భాగస్వామిగా మారాయన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. 2014లో శ్రీసిటీలో ప్రారంభమైన నిట్టల్ కంపెనీ నాణ్యతా ప్రమాణాలకు పెద్ద పీట వేస్తూ బలమైన ముద్రను చాటుకుందని తెలిపారు. నూతన ప్లాంట్ సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. దీంతో సంస్థ పెట్టుబడి రూ.257 కోట్లకు.. ఉద్యోగుల సంఖ్య 270 నుంచి 370కు పెరిగింది. ఈ కార్యక్రమంలో నిట్టన్ సంస్థ ప్రతినిధులు టెరుఆకి అండో, యుమికి షిండో, చో సియంగ్ హ్వాన్, రోయూన్ హో తదితరులు పాల్గొన్నారు.


→ ప్రమాణ స్వీకారం చేస్తున్న వాకిచర్ల గుర్రప్పశెట్టి

ముక్కంటి ధర్మకర్తలమండలిలో నలుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి సభ్యుడిగా వాకిచర్ల గుర్రప్పశెట్టి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ధర్మకర్తలమండలి సభ్యుడిగా గుర్రప్పశెట్టి బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆయనతో పాటు గాదిపాకుల గోపి, లక్ష్మమ్మ, విశాలాక్షి కూడా సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆలయాధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ సస్పెన్షన్

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై విచారణకు ఆదేశం

రేణిగుంట అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల జరిగిన పరిణామాలపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ తిరుమలేశ్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి మధ్య జరిగిన వివాదాల నేపథ్యంలో ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అలాగే ఇటీవల డాక్యుమెంట్ రైటర్లు, అటెండర్ మధ్య వాగ్వాదం జరిగింది. విధుల్లో ఉండగా మీడియాతో మాట్లాడటం, సబ్‌రిజిస్ట్రార్‌పై అవినీతి ఆరోపణలు చేయడంపై అనంతపురం రిజిస్ట్రార్ నివేదిక మేరకు అటెండర్ తిరుమలేశ్‌ను సస్పెండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ రాంకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రేమించకుంటే కుటుంబాన్ని చంపేస్తా..

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను...నువ్వు నన్ను ప్రేమించకుంటే మీ కుటుంబాన్ని చంపేస్తా' అని బాలికను వేధించిన యువకుడిని తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి వివరాల మేరకు... చిత్తూరు జిల్లా చెన్నంపల్లి గ్రామానికి చెందిన కోలా దిలీప్‌కుమార్ తిరుపతిలోని ఒక అపార్టుమెంటులో కాపురముంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను ఆరు నెలలుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. వెంటపడి బెదిరిస్తున్నాడు. గురువారం రాత్రి బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఆమె చేయి పట్టుకుని ప్రేమించకపోతే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లి, అన్న వచ్చి అడ్డుకున్నారు. వారినీ బెదిరించాడు. చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం కోలా దిలీప్‌కుమార్‌ను ఆర్సీ పురం జంక్షన్ వద్ద అరెస్టు చేశారు.

44 మంది సచివాలయ ఉద్యోగులకు.. షోకాజ్ నోటీసులు

● పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసిన ఫలితం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేసిన 44 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే పది గంటల్లోపు ఒకరికి కూడా ఇవ్వకపోవడంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు.. జిల్లాలోని శ్రీకాళహస్తి, గూడూరు, తిరుపతి, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, వెంకటగిరి, డక్కిలి, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, వడమాలపేట, పాకాల, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, పుత్తూరు ప్రాంతాలకు చెందిన 44మంది సచివాలయ ఉద్యోగులకు మండలాధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు బాలికల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు మొబైల్స్‌ను అవసరమైనంత వరకే వినియోగించాలని, సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, ఏఎస్‌ఐలు లక్ష్మీపతి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రాణాలు కాపాడిన మంత్రి స్వామి

గూడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ విద్యార్థినికి మెరుగైన వైద్యం అందేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చర్యలు తీసుకుని ప్రాణాలను కాపాడారు. నెల్లూరు జిల్లా రాపూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇటీవల తీవ్ర అస్వస్థతకు లోనైంది. వార్డెన్ వెంటనే విద్యార్థినిని గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి తిరుపతి జిల్లా కలెక్టర్, వైద్యులతో మాట్లాడి తిరుపతి స్విమ్స్‌లో చేర్పించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ విద్యార్థిని ప్రాణాపాయస్థితి నుంచి కోలుకుని ఆరోగ్యం కుదుటపడింది. మరికొద్ది రోజుల్లో ఆస్పత్రి నుంచి విద్యార్థినిని డిశ్చార్జి చేస్తామని వైద్యులు వెల్లడించారు. విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తాను సాంఘికశాఖ సంక్షేమ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో అనారోగ్యానికి గురైన 30 మందికి పైగా విద్యార్థులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి బాలవీరాంజనేయస్వామి ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీసీఈవో మోహన్‌రావు

చిల్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని జడ్పీ సీఈవో మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కడివేడు గ్రామాన్ని సందర్శించి పారి శుధ్యం స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టి స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కడివేడు ఎస్సీకాలనీ అభివృద్ధికి రూ.20లక్షల మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ.15లక్షలు సీసీ రోడ్లు, రూ.5లక్షలు తాగునీటి కోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి అల్లీబాషా తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో కార్యాలయ పనులను త్వరగా పూర్తి చేయండి

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు జడ్పీ సీఈవో మోహన్‌రావు అన్నారు. శుక్రవారం డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న డీఎల్‌డీవో కార్యాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి వచ్చే నెల 1వ తేదీలోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వాణి, ఎంపీడీవో మధుసూదన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వదేశీ' వినియోగంతో దేశ పురోగతి

పెళ్లకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వినియోగించడం ద్వారా దేశం ఆర్థికంగా.. పారిశ్రామికంగా పురోగతి సాధిస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వదేశీ వస్తువుల వినయోగంపై అవగాహన కల్పించేందుకు పాలచ్చూరు, అనకవోలు, పెరుమాళ్లపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కలలు గన్న ఆత్మ నిర్భర్ భారత్ సాధ్యమవ్వాలంటే ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, గోగుతోటి మురళి పాల్గొన్నారు.

డిపో మేనేజర్ వైఖరికి నిరసనగా ధర్నా

వాకాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పనిభారం వల్ల అనారోగ్యం బారిన పడినా విధులు నిర్వహించాలంటూ డిపో మేనేజర్ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈడీ హెడ్ ఆఫీసు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం ఓడీ డ్యూటీలను అమలు చేయాలని, నెలలో మూడు రోజులపాటు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎండీ డిపోను పరిశీలించి ఇచ్చిన ఆదేశాల ప్రకారం 55 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లకు సీనియార్టీ ప్రకారం కండెక్టర్ల విధులు కేటాయించాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: కిలివేటి

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం 9, 12 వార్డుల్లో వైసీపీ నాయకులతో కలిసి కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి, కటకం దీపిక, ధనలక్ష్మి, వెంకటకృష్ణారెడ్డి, అశోక్, శాంతి, సోమశేఖర్‌రెడ్డి, చదలవాడ కుమార్, కటకం జయరాం, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంకులో ఆర్ఎం తనిఖీలు

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో గల స్టేట్‌బ్యాంక్‌ను శుక్రవారం రీజనల్ మేనేజర్ సత్యనారాయణ స్వామి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, డ్వాక్రా మహిళల రుణాలపై చర్చించారు. అనంతరం ఖాతాదారుల సమావేశంలో సైబర్ నేరగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రెడ్డి నగేష్, ఎఫ్‌వో విజయకుమార్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని టీడీపీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెందోడులో ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన నోవా బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నోవాబ్లడ్ బ్యాంక్ ప్రతినిధి దీనా మోడ్ కురియన్, ఎంవీరావు ఫౌండేషన్ చైర్మన్ లీలా మోహన్, విజయలక్ష్మి దంపతులను షీల్డ్‌లతో అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనయ్య, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పుట్టయ్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుమ్మూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలోని సత్యసాయి బాబా మందిరం వద్ద శుక్రవారం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 సంవత్సరాల వయసున్న వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఈకొంది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న రొయ్యల వ్యాన్

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని తిన్నెలపూడి రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి రొయ్యల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వాకాడు నుంచి రొయ్యల లోడ్‌తో నెల్లూరు వెళ్తున్న వ్యాన్ తిన్నెలపూడి క్రాస్‌రోడ్డు వద్ద డివైడర్‌ను ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.





గుంతలతో పాటు రాళ్లు తేలిన రోడ్డు - వర్షానికి మడుగులను తలపిస్తున్న గోతులు

అడుగడుగునా గోతులు... ప్రయాణం సాగేదెలా?

అధ్వానంగా కోటపోలూరు రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కోటపోలూరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ముందే గుంతల మయంగా ఉన్న ఈ రోడ్డు వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మడుగులను తలపిస్తోంది. సూళ్లూరుపేట హైవే నుంచి కోటపోలూరు ఈస్ట్ హరిజనవాడ రోడ్డు వరకు అడుగడుగునా గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సూళ్లూరుపేట నుంచి కోట - వాకాడుకు కోటపోలూరు మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక, కారికాడు, జంగాలగుంట, మీజూరు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే సూళ్లూరుపేటకు వచ్చిపోతుంటారు. హైవే నుంచి గ్రామాల గమ్యం చేరే వరకు దారిపొడవునా గోతులు ఉండడంతో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షమొచ్చిన గుంతల్లో నీరు నిలబడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూళ్లూరుపేట నుంచి కోటపోలూరు వరకు నాలుగు కిలో మీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అయితే రోడ్డంతా రాళ్లు తేలిపోయి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరిని వివరణ కోరగా కోటపోలూరు రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అనుమతులు వస్తామని, గోతులు పూడ్చి రోడ్డును బాగు చేస్తామని చెప్పారు.







గాజులపెళ్లూరు, గాజులపెళ్లూరు బస్టాండ్, సాధనవారిపాళెం వద్ద గుంతలు

వర్షాలతో అధ్వానంగా మారిన సూళ్లూరుపేట రోడ్డు

అమలు కాని ఉప ముఖ్యమంత్రి హామీ ● రెండు వరుసల రహదారి కోసం నిరీక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట -బుచ్చినాయుడుకండ్రిగ రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారింది. పెరిటిపాడు వరకు రోడ్డు ఛిద్రమైంది. మతకాముడి, గాజులపెళ్లూరు మధ్య అర కిలోమీటరు రోడ్డులో పెద్దపెద్ద గుంతలతో పాటుగా కోతకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా ఉగ్గమూడి, సాధన వారిపాళెం, సీసీఎల్ పరిశ్రమ, సంతవేలూరుల సమీపంలో రోడ్డులో గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్సులు, లారీలకు ఇబ్బందులు తప్పడం లేదు. బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి మండలాల నుంచి సూళ్లూరుపేటలోని అపాచీ పరిశ్రమకు నిత్యం వందలాది మంది కార్మికులు బస్సులు, ద్విచక్ర వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ రోడ్డు కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు దిగితే గుంతల్లో ఇరుక్కుపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సూళ్లూరు పేట నుంచి పెరిటిపాడు వరకు రెండు వరుసల రహదారిని నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో పెరిటిపాడు నుంచి బీఎన్‌కండ్రిగ వరకు పది కిలోమీటర్ల రోడ్డు పనులు ఆపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024 ఆగస్టు 13న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేందుకు బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు మీదగా వెళ్లారు. ఆ దారిలో ఇబ్బందులను గుర్తించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు రహదారికి ఇరువైపులా మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో రెండు వరుసల రహదారి వస్తుందని ఎదురు చూసిన గ్రామీణు లకు నిరాశే మిగిలింది.

ప్రయాణించలేకపోతున్నాం



బుచ్చినాయుడుకండ్రిగ నుంచి ప్రతిరోజూ అపాచీ పరిశ్రమకు బస్సులో వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నా. అరగంట ప్రయాణానికి గంటకుపైగా పడుతోంది. రోడ్డులోని గంతలతో నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నా. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- వెంకటరమణ, అపాచీ కార్మికుడు

ఆటోకు ప్రతి నెలా మరమ్మతులే



బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేట రోడ్డులో ఆటో తోలుతుంటా. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రతి నెలా ఆటో మరమ్మతులు చేయిస్తున్నా. ఆటో ద్వారా వచ్చే ఆదాయం కన్నా మరమ్మతులకే ఎక్కువ ఖర్చు చేసున్నా. ప్రసుత్తం కురుస్తున్న వరాల్లతో రోడ్డులో ఆటోను తిప్పడం మానేశా.

- చిట్టి, ఆటో డ్రైవర్

రెండు వరుసల రహదారి నిర్మించండి



కూటమి ప్రభుత్వం అయినా బుచ్చినాయుడుకండ్రిగ - సూళ్లూరుపేట రహదారిని రెండు వరుసలుగా మార్చాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అనేక రోడ్లకు నిధులు మంజూరు చేసి బాగు చేశారు. నిత్యం వందలాది మంది కార్మికులు ప్రయాణించే ఈ మార్గం సక్రమంగా లేని కారణంగా ఇబ్బంది పడుతున్నాం.

- శ్రీనివాసులురెడ్డి, రైతు

శాకాంబరిదేవిగా రాజరాజేశ్వరిదేవి



గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి పూజలు జరిపారు. దసరా నెల పొంగళ్ల పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాకాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం వాకాడు సచివాలయం-1ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వీధుల్లో మురుగు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయాలన్నారు.

వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలు



స్టీల్స్, సిమెంట్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, రామకృష్ణ

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిల్లకూరు బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ స్టీల్స్, సిమెంట్ దుకాణాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. మంచి నాణ్యత గల ఇనుము, సిమెంట్‌ను హోల్‌సేల్ ధరలకే రీటైల్‌గా వినియోగదారులకు అందజేసేలా గూడూరులో దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దుకాణ యజమానురాలు గోను సంధ్యారాణి మాట్లాడుతూ వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. తమ దుకాణంలో అన్ని రకాల స్టీల్, సిమెంట్ బ్రాండ్లు సరసమైన ధరలకే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పాశిం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, కొండేపాటి కోమలి, జశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా కాశీ నాయక్



ఎంపీడీవో ఉమామహేశ్వరావుకు జాయినింగ్ రిపోర్ట్ అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో కాశీ నాయక్

చిట్టమూరు, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు డిప్యూటీ ఎంపీడీవోగా కాశీ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం నిడమనూరు పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేసిన కాశీ నాయక్ పదోన్నతిపై చిట్టమూరు డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరోమారు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని జీలపాటూరు, అనకవోలు, చెంబేడు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. జీలపాటూరు ఆధార్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తారని, 0-6 పిల్లలతో పాటు ఇప్పటి వరకు ఆధార్ లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ శిబిరాల పరిశీలన

బాలాయపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, వెంగమాంబపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. వెంగమాంబపురంలో ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో నారాయణ పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బస్సు దగ్ధం బాధాకరం: కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో బస్సు దగ్ధమై ప్రయాణికులు దుర్మరణం చెందడం బాధాకరమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూల్ జిల్లాలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని దగ్ధమవడం, అందులోని ప్రయాణికులు నిద్రలోనే మృత్యువాత పడడం పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన 14మంది విద్యార్థులు లెవెల్-1లో ఉత్తీర్ణత సాధించి లెవెల్-2 పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి అన్నారు. లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాజ్యాంగ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు హెచ్ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జి.వెంకటేశ్వర్లు, జి.సుబ్రహ్మణ్యం, చెంచుకుమార్, సుభాష్, శ్రావణ్, అమృత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం మీనాకుమారి

బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు

చిట్టమూరు, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలానికి చెందిన వైసీపీ నాయకులు తుమ్మగుంట భాస్కర్, తోట విజయ్ కుమార్, మారుబోయిన వెంకయ్య, లీలా మసూద్, నూరి చెంగయ్యతో పాటు పలువురు కార్యకర్తలు శుక్రవారం బీజేపీ చేరారు. వారికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్ చంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిల్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిక్సిడ్ కాలనీ చెందిన ముత్తాయ్ అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల కోసం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ రూ.5వేలు అందజేశారు. ఈ నగదును మాజీ సర్పంచు నెల్లూరు రామ్మూర్తి, రవిబాబు, శ్రీనివాసులు తదితరులు ముత్తాయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీరువాల వితరణ

చిల్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు బీరువాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, కృష్ణమూర్తి, గిరినాద్, మురళీరెడ్డి, రమణయ్య, శీనయ్య, వీరేంద్రనాద్, రవి చంద్ర, హెచ్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ అనుసంధానం

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట, విద్యానగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, ఎంఈవో మస్తానయ్య పర్యవేక్షణలో ఆధార్ అనుసంధానం చేశారు.